
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5




విశాఖపట్నం

జిల్లా వార్తలు

ఆదివారం 29 డిసెంబరు 2024

# నేవీ రిహార్సల్స్

» 4న సాహస విన్యాసాల ప్రదర్శన



హెలికాప్టర్ నుంచి బోటుపైకి దిగుతున్న కమాండోలు

సాగర తీరం శనివారం సాయంత్రం బాంబు పేలుళ్లతో మోతెక్కిపోయింది. ఆకాశం నుంచి ఊడిపడినట్టుగా మెరైన్ కమాండోలు పారాచూట్ల సాయంతో కిందికి దిగి నైపుణ్యం ప్రదర్శించారు. జనవరి 4వ తేదీన నిర్వహించనున్న సాహస విన్యాసాల ప్రదర్శనలో భాగంగా శనివారం తూర్పు నౌకాదళం రిహార్సల్స్ నిర్వహించింది. ఇందులో యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, నిఘా విమానాలు, యుద్ధనౌకలు, సబ్‌మెరైన్లు పాల్గొన్నాయి. శత్రు స్థావరంపై దాడి, సముద్రంలో మునిగిపోతున్న వారిని రక్షించడం, సముద్రంలో వెళుతున్న నౌకపై హెలికాప్టర్లను ల్యాండింగ్ చేయడం వంటి అంశాలను ప్రదర్శించారు. నల్లదుస్తులతో మెరైన్ కమాండోలు ప్రదర్శించిన సాహసాలు నగర ప్రజలను ఆకట్టుకున్నాయి.


- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

# శభాష్ నితీశ్

## ఆస్ట్రేలియాపై సెంచరీ కొట్టిన విశాఖ కుర్రాడు

### క్రీడాభిమానుల హర్షం

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖకు చెందిన యువ క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డి శనివారం ఆసీస్ బౌలర్లను చెడుగుడు ఆడుకున్నాడు. మెల్‌బోర్న్‌లో జరుగుతున్న నాలుగో టెస్టులో అజేయ సెంచరీ (105 నాటౌట్)తో నిలిచాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్, పంత్, జడేజా వంటి స్టార్ ఆటగాళ్లు తక్కువ స్కోర్లకే పెవెలియన్ దారిపట్టిన దశలో బ్యాటింగ్‌కు దిగిన నితీశ్‌కుమార్‌రెడ్డి భారత స్కోరు బోర్డును ముందుకు నడిపించే బాధ్యతను తీసుకున్నాడు. మరో ఎండ్‌లో ఆడుతున్న వాషింగ్టన్ సుందర్ చక్కని సహకారం అందించడంతో ఆసీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతను అర్ధసెంచరీ పూర్తి చేసి (50)న తరువాత అవుటవ్వడంతో నితీశ్ కాస్త జోరు తగ్గించాడు. అయితే ... మిగతా 6వ పేజీలో



సెంచరీ అనంతరం నితీశ్ అభివాదం



నితీశ్ స్వగ్రామం తుంగ్లాంలో సంబరాలు చేసుకుంటున్న యువకులు

# సంక్రాంతికి 1000 బస్సులు

» దూర ప్రాంతాలకు 200 సర్వీసులు

» జోనల్ పరిధిలో 800...

» ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు

ద్వారకా బస్‌స్టేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వెయ్యి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళికను రూపొందించినట్టు ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. ద్వారకా బస్ స్టేషన్‌లోని తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా డిపో మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, చెకింగ్ ఇన్‌స్పెక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్, విజయవాడ, భీమవరం, ఖమ్మం, రాజోలు, తిరుపతి, చెన్నై వంటి దూర ప్రాంతాలకు 200 స్పెషల్స్, విజయనగరం జోనల్ పరిధిలోని రాజమండ్రి, కాకినాడ, ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళం, బొబ్బిలి, సాలూరు, రాజాం, విజయనగరం ప్రాంతాలకు 800 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.ఏ డిపో నుంచి ఎన్ని బస్సులను ఇందుకు వినియోగించాలో డిపో ... మిగతా 6వ పేజీలో

# కూటమి జోరు... వైసీపీ బేజారు

## జిల్లాలో మారిన రాజకీయ ముఖచిత్రం

ఐదేళ్లకొకసారి జరిగే సాధారణ ఎన్నికలు 2024లో రావడంతో జిల్లా రాజకీయ ముఖచిత్రంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అప్పటివరకూ అధికారంలో ఉన్న వైసీపీ ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేని దుస్థితికి చేరగా, విపక్ష పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి అనూహ్య విజయాన్ని సాధించి అధికార పగ్గాలు చేపట్టాయి. విశాఖ జిల్లాలో వైసీపీకి ఒక్క అసెంబ్లీ స్థానం కూడా దక్కకపోవడం గమనార్హం. విశాఖ ఎంపీ స్థానాన్ని అత్యధిక మెజారిటీతో తెలుగుదేశం తన ఖాతాలో వేసుకుంది.

- విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి

కాలచక్రం 2024 పొలిటికల్



పల్లా శ్రీనివాసరావు | ఎంపీ శ్రీభరత్ | గంటా శ్రీనివాసరావు

» సార్వత్రిక ఎన్నికల్లో మూడు పార్టీలతో కూడిన కూటమి క్లీన్ స్వీప్

» అందరికీ భారీ మెజారిటీలు

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు

» ప్రభుత్వ విప్‌గా గణబాబు

» పలువురికి కార్పొరేషన్ చైర్మన్ పదవులు

» మరోవైపు నేతల రాజీనామాలతో వైసీపీ ఉక్కిరిబిక్కిరి

» ఇప్పటికే ముత్తంశెట్టి, ఆడారి గుడ్‌బై

» జిల్లా అధ్యక్షులు, సమన్వయకర్తల మార్పు

### ఓడలు బళ్లు... బళ్లు ఓడలు

ఉమ్మడి విశాఖ జిల్లాగా ఉన్నప్పుడు 2019లో జరిగిన ఎన్నికల్లో విశాఖపట్నం నగరంలోని నాలుగు (తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ) నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించగా, మిగిలిన 11 (భీమిలి, పెందుర్తి, గాజువాక, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, ఎలమంచిలి, పాయకరావుపేట, మాడుగుల, అరకు, పాడేరు) స్థానాలు, మూడు ఎంపీ స్థానాలను వైసీపీయే గెలుచుకుంది. విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా గెలుపొందిన వాసుపల్లి గణేశ్‌కుమార్ ఎన్నికల తరువాత వైసీపీలో చేరారు. ఇక ఎన్నికలు సమీపిస్తున్నాయనగా వైసీపీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్తను మార్చింది. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని తప్పించి వైవీ సుబ్బారెడ్డిని నియమించింది. మరోవైపు వైసీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌లు బయటకు వచ్చి జనసేనలో చేరారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వాసుపల్లి గణేశ్‌కుమార్‌తో సఖ్యత కుదరక బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ తెలుగుదేశం పార్టీలో చేరారు.

### రసవత్తరంగా ఎన్నికలు

మార్చి నెలలో ఎన్నికల ప్రకటన రాగానే రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. రెండేళ్ల క్రితం జిల్లాలను పునర్విభజన చేయడంతో విశాఖ జిల్లాలో ... మిగతా 6వ పేజీలో

# నైట్ ఫుడ్‌కోర్టుపై అల్టిమేటమ్

» తొలగించకుంటే ఆందోళనకు దిగుతామంటున్న కూటమి కార్పొరేటర్లు



పాతజైలురోడ్డులో అనుమతిలేకుండా కొనసాగుతున్న నైట్‌ఫుడ్‌కోర్ట్

విశాఖపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాత జైలురోడ్డులో గల నైట్ ఫుడ్ కోర్టు తొలగింపు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. జీవీఎంసీ అనుమతి లేకుండా నడుస్తున్న ఫుడ్ కోర్టును అక్కడ నుంచి తొలగించాలంటూ గత ఏడాది జూన్‌లో కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఇప్పటికీ తీర్మానం అమలుకాకపోవడంతో కూటమి కార్పొరేటర్లు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఆదివారం ఫుడ్ కోర్ట్‌ను మూసివేయకపోతే ధర్నాకు దిగుతామంటూ కమిషనర్ సంపత్‌కుమార్‌కు శనివారం కూటమి కార్పొరేటర్లు పీతల మూర్తియాదవ్, గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు,తదితరులు నోటీస్ అందజేశారు.

# పథకం ప్రకారమే గ్రీన్‌బెల్ట్ కొట్టేశారు

రూ.60 కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి నాలుగేళ్ల క్రితమే ఏఎస్ఎన్ మెగా షాపింగ్ మాల్ యాజమాన్యం స్కెచ్

» ఏపీఐఐసీకి సమర్పించిన ప్లాన్‌లోనే ప్రస్తావన

» మూడు మార్గాలకు ఏర్పాట్లు

» 60 అడుగుల పొడవుతో రెండు డ్రైవ్ వేస్

» నేషనల్ హైవే అథారిటీ ఎన్‌ఓసీ ఇవ్వక ముందే నిర్మాణానికి సిద్ధం

» అనుమతులు లేకుండానే పనులు

» ఉలుకూ పలుకూ లేని అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కప్పరాడలో ప్రభుత్వ స్థలాన్ని అడ్డగోలుగా కొట్టేయాలని మెగా షాపింగ్ మాల్ యజమానులు ముందుగానే ప్లాన్ వేసుకున్నారు. వారికి మూడు ఎకరాల స్థలం ఉన్నా అది సరిపోదని గ్రీన్ బెల్ట్‌ను కలిపేసుకున్నారు. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను అడ్డం పెట్టుకొని పబ్బం గడుపుకుంటున్నారు. గత కొద్దిరోజులుగా ఈ షాపింగ్‌మాల్ నిర్మాణంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వస్తున్నా...ఒక్క అధికారి గాని, ఒక్క ప్రజా ప్రతినిధి గానీ స్పందించకపోవడం గమనార్హం.



ఏఎస్ఎన్ మెగా షాపింగ్ మాల్ ముందు గ్రీన్ బెల్టును పూర్తిగా తొలగించిన దృశ్యం

పాస్‌పోర్టు సేవా కేంద్రం ఎదురుగా మూడు ఎకరాల స్థలంలో అలక్రమ్ ఇంటర్నేషనల్ ట్రేడింగ్ కంపెనీ 'ఏఎస్ఎన్ మెగా షాపింగ్ మాల్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. భూ వినియోగ మార్పిడి (పరిశ్రమ నుంచి వాణిజ్యానికి) చేసుకున్నాకే మాల్ నిర్మాణం చేపట్టాలి. అందు కోసం ప్రభుత్వానికి భారీగా ఫీజు కట్టాలి. కానీ, అవేమీ లేకుండానే నిర్మాణం సగం పూర్తిచేసేశారు. కోట్ల రూపాయల ఆదాయం రావలసి ఉన్నా రెవెన్యూ అధికారులు ప్రశ్నించడం లేదు. ఇకపోతే ఈ భూమి ఏపీఐఐసీ లేఅవుట్‌లో ఉండడంతో మాల్ నిర్మాణానికి ఐలా కమిషనర్‌కు 2021లో దరఖాస్తు చేశారు. అప్పుడే వారి స్థలానికి ... మిగతా 6వ పేజీలో

# అంగన్‌వాడీలకు పుస్తకాలొచ్చాయ్

విశాఖపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఎట్టకేలకు పుస్తకాలు వచ్చాయి. సాధారణంగా నూతన విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఈ ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంటుంది. అయితే, గత వైసీపీ ప్రభుత్వం అందుకు అవసరమైన చర్యల ను చేపట్టకపోవడంతో చిన్నారులకు పుస్తకాలు అందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ విషయాన్ని గుర్తించి పుస్తకాల పంపిణీకి చర్యలు చేపట్టింది.

» వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆలస్యం

» కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతే ముద్రణ, పంపిణీ

» మాతృభాషకు ప్రాధాన్యమిచ్చేలా తెలుగు అభ్యాస దీపిక

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నారు. మూడేళ్లలోపు చిన్నారులను పీపీ-1 (ప్రీ ప్రైమరీ-1), మూడు నుంచి ఆరేళ్ల మధ్య చిన్నారులను పీపీ-2గా విభజించి పాఠాలను బోధిస్తున్నారు. ఈ మేరకు పీపీ-1కు సంబంధించి 42,110 పుస్తకాలు (భీమిలి ప్రాజెక్టు పరిధిలోని కేంద్రాలకు 10,800, పెందుర్తి ప్రాజెక్టుకు 12,060, విశాఖపట్నం అర్బన్ పరిధిలోని కేంద్రాలకు 19,250) పుస్తకాలు వచ్చాయి. పీపీ-2 పుస్తకాలు 6,185 (పెందుర్తికి 4,855, విశాఖపట్నం అర్బన్ పరిధి కేంద్రాల్లోని చిన్నారులకు 7,535) వచ్చాయి. ఇందులో స్పోకెన్ ఇంగ్లీష్, ఇంగ్లీష్, యాక్టివిటీ బుక్, తెలుగు పుస్తకాలు ఉన్నాయి.

### తెలుగుకు ప్రాధాన్యమిచ్చేలా..

కూటమి ప్రభుత్వం తెలుగు భాషకు ప్రాధాన్యం ఇస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమ మోజులో తెలుగును నిర్వీర్యం చేసింది. ఫలితంగా ప్రాథ మిక దశలో మాతృ భాషా వికాసం పూర్తిగా కొరవడింది. అయితే కూటమి ప్రభుత్వం తెలుగు భాషను మరింత పకడ్బందీగా నేర్పించేలా చర్యలను చేపట్టింది. అందుకు అనుగుణంగా తాజాగా పంపిణీ చేసిన పుస్తకాల్లో తెలుగు అభ్యాస దీపికను ప్రవేశపెట్టింది.

# జైలు ఎదుట ఆందోళన

» ఇద్దరు వార్డర్లను తనిఖీ చేసిన ఇన్‌చార్జి సూపరింటెండెంట్

» విధి నిర్వహణ పేరుతో తమను ఆయన వేధిస్తున్నారంటూ నిరసనకు దిగిన వార్డర్లు, కుటుంబ సభ్యులు

» క్షమాపణ చెప్పాలని డిమాండ్



జైలు ప్రధాన ద్వారం ఎదుట ఆందోళనకు దిగిన వార్డర్ల కుటుంబ సభ్యులు

ఆరిలోవ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారం ఎదుట జైలు వార్డర్ల కుటుంబసభ్యులు శనివారం ఆందోళనకు దిగారు. తమను విధి నిర్వహణ పేరుతో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మహేష్‌బాబు వేధిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి వార్డర్లు, వారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వార్డర్లుగా పనిచేస్తున్న జయకృష్ణ, శంభు శనివారం ఉదయం విధి నిర్వహణ నిమిత్తం జైలు ప్రధానద్వారం దాటి లోపలకు ప్రవేశించారు. గంజాయి లోపలకు తీసుకువస్తున్నారనే అనుమానంతో వారిద్దరినీ అక్కడే ఉన్న ప్రైవసీ గదిలోకి తీసుకువెళ్లి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మహేష్‌బాబు తనిఖీ చేశారు. ఖైదీల ఎదురుగా దుస్తులు విప్పించి తనిఖీ చేయడంపై వార్డర్లు అభ్యంతరం వ్యక్తంచేశారు. దాంతో ఇన్‌చార్జి ... మిగతా 6వ పేజీలో



గ్రేహౌండ్స్ మైదానంలో ఫైరింగ్ చేస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

# సీపీ గన్ ఫైరింగ్ ప్రాక్టీస్

విశాఖపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి: ఏటా నిర్వహించే గన్ ఫైరింగ్ వార్షిక ప్రాక్టీస్‌లో సీపీ శంఖబ్రతబాగ్చి శనివారం పాల్గొన్నారు. కాపులుప్పాడలోని గ్రేహౌండ్స్ మైదానంలో గ్రేహౌండ్స్ నగర పోలీస్ అధికారులతో కలిసి ఆయన ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. ఏటా రెండు విడతలుగా గన్‌ఫైరింగ్ ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది. కానిస్టేబుల్ నుంచి సీపీ వరకు అందరూ ఈ ప్రాక్టీస్‌లో పాల్గొని ఫైరింగ్‌లో నైపుణ్యాన్ని పెంచుకోవాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో డీసీపీలు అజితా వేజెండ్ల, మేరీప్రశాంతితో పాటు గ్రేహౌండ్స్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


అమ్మవారికి నీరాజనాలిస్తున్న అర్చకుడు

## వైభవంగా ధనుర్మాసోత్సవాలు

సింహాచలం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తిని గోదాదేవిగా అలంకరించి పల్లకిలో అధిష్టంపజేశారు. షోడశోపచార పూజలు తరువాత ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల మంత్రోచ్ఛారణల నడుమ బేడా మండప తిరువీధి నిర్వహించారు. అనంతరం ఆండాళ్ అమ్మవారి సన్నిధానంలో గోదాదేవి రచించిన తిరుప్పావైలోని 13 పాశురాన్ని విన్నవించారు.

## శని త్రయోదశి పూజలు

సింహాచలం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డులోని పలు శైవ క్షేత్రాల్లో భక్తులు శని త్రయోదశి పూజలు నిర్వహించారు. విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌశ్వేరస్వామి, కాపు వీధిలోని ఎన్ని సత్యారావు ఆలయ ఆవరణలో, పాత అడివివరం విశ్వేశ్వరస్వామి ఆలయ పరిధిలోని నవ గ్రహాలకు తైలాభిషేకాలతో పూజలు చేశారు. అలాగే సింహగిరి క్షేత్ర పాలకుడు బాల త్రిపుర సుందరి సహిత త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వర పంచాయతన ఆలయంలో పరమేశునికి పూజలు, అభిషేకాలు జరిపారు.

**మధురవాడ** : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని మానం ఆంజనేయనగర్‌లో ఉన్న లలిత త్రిపుర సుందరీ సమేత మహాకామేశ్వరస్వామి ఆలయంలో శని త్రయోదశి పురస్కరించుకుని భక్తులు నవగ్రహాలకు, నందీశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేశ్ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

## సింహగిరిపై టిప్పర్ బోల్తా



సింహాచలం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి హిల్ టాప్ రోడ్డులో శనివారం తెల్లవారుజామున టిప్పరు బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పర్యాటక, దేవదాయ శాఖ సంయుక్తంగా చేపడుతున్న ప్రసాద్ పనుల్లో భాగంగా హిల్ టాప్ రోడ్డులో టివిస్టేషన్‌కు సమీపంలో గ్రావెల్ తరలింపునకు వినియోగిస్తున్న టిప్పరు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో టిప్పర్ ముందు భాగంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం పాడవ్వడంతో వేకువ జామున 4.30 నుంచి ఉదయం 6 గంటల వరకు సరఫరా నిలిచిపోయింది.

## ఆర్‌వై అగ్రహారంలో రెవెన్యూ సదస్సు

భీమునిపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నిడిగట్టు సచివాలయం పరిధి రామయోగి అగ్రహారంలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ పి. రామారావు ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో గ్రామస్తులు అయిదు వినతులు అందించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల వినతులు పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారుల సూచనలు మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## రేవిడిలో 44 వినతులు

**పద్మనాభం** : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె. ఆనందరావు చెప్పారు. రేవిడిలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రెవెన్యూ శాఖ పరంగా రైతులు, ప్రజలు ఎటువంటి సమస్యలు తలెత్తినా పరిష్కరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. అనంతరం 44 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, ఆర్ఐ శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరికి గాయాలు

ఎండాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. అక్కయ్యపాలేనికి చెందిన ఏలూరి రవికిరణ్ ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 27న రాత్రి పీఎంపాలెం క్రికెట్ స్టేడియం వద్ద లారీ వెనుక నుంచి ఢీకొనడంతో గాయపడ్డాడు. అలాగే పీఎంపాలెం చివరి బస్టాప్ వద్ద కోటిపల్లి సంజీవరావు రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# సంక్రాంతికి 1000 బస్సులు

... 5వ పేజీ తరువాయి

మేనేజర్లు గుర్తించాలని సూచించారు. గరుడ, గరుడ ప్లస్, అమరావతి, నైట్ రైడర్, క్రూయిజ్, ఆల్ట్రా డీలక్స్ వంటి సర్వీసులను దూర ప్రాంతాలకు, ఆల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, సూపర్ డీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ వంటి సర్వీసులను జోనల్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు నడిపేందుకు ఏర్పాట్లు చేయాలని డిపో మేనేజర్లకు ఆయన ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, డిపో మేనేజర్లు గంగాధర్ (విశాఖపట్నం), అరుణకుమారి (మద్దిలపాలెం), ప్రవీణ (గాజువాక),రాజశేఖర్ (సింహాచలం), అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు పాల్గొన్నారు.


సభలో ఆందోళన చేస్తున్న చిన్నయ్యపాలెం గ్రామస్థులు


మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్డీవో సుధా సాగర్

# మైనింగ్ తవ్వకాలు వద్దు

- వ్యతిరేకించిన చిన్నయ్యపాలెం గ్రామస్థులు
- ప్రజాభిప్రాయ సేకరణ సభలో ఆందోళన

ఆనందపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుసులువాడ పంచాయతీ చిన్నయ్యపాలెంలో మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దని స్థానికులు కోరారు. మైనింగ్ తవ్వకాలకు సంబంధించి శనివారం ఇచ్ఛాపురం గ్రామంలో హెచ్‌పీసీఎల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఇన్‌చార్జి ఆర్డీవో సుధాసాగర్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ముందుగా తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ కుసులువాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 104లో 7.991 హెక్టర్ల మేర విస్తరించి ఉన్న ప్రభుత్వ కొండ భూమిలో క్వారీ లీజు కోసం వీఆర్ ఇన్ఫ్రా అండ్ టెక్నాలజీస్ దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. గత ఆగస్టు 28న జాయింట్ కలెక్టర్ మయూర అశోక్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా బ్లాస్టింగ్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ గ్రామస్తులు ఆందోళన చేయడంతో సభను అర్థాంతరంగా నిలిపివేశామని చెప్పారు. అప్పటి తప్పులను సరిచేసుకుని బ్లాస్టింగ్ చేపట్టకుండా జాక్ హామర్ టెక్నాలజీ ద్వారా తవ్వకాలు చేపడతామని కంపెనీ యాజమాన్యం నిబంధనల ప్రకారం దరఖాస్తు చేయడంతో మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్టు వివరించారు. దీంతో సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి ఆర్డీవో సుధాసాగర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి అభిప్రాయం తీసుకుంటామని, ఆందోళన చేయకుండా అభిప్రాయాలు చెప్పాలని కోరారు. అభిప్రాయ సేకరణ అనంతరం క్వారీ తవ్వకాలకు అనుమతి ఇవ్వాలా వద్దా అన్నది నిర్ణయిస్తామని చెప్పడంతో గ్రామస్థులు ఆందోళన విరమించి, తమ అభిప్రాయాలను తెలిపారు. చిన్నయ్యపాలెం గ్రామస్తుడు కొప్పల భీమరాజు మాట్లాడుతూ క్వారీయింగ్‌కు కేటాయిస్తున్న ప్రదేశం తమ గ్రామానికి రెండు వందల మీటర్ల దూరంలో ఉందని, తవ్వకాల వల్ల గాలి, నీరు, వాతావరణం కలుషితమై ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. స్వచ్ఛంద సేవకులు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది లేకుండా స్థానికులకు ఉపాధి కల్పిస్తూ పర్యావరణానికి హాని కలగకుండా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం గ్రామానికి చెందిన 40 మంది నుంచి అధికారులు అభిప్రాయాలు సేకరించారు. వీఆర్ ఇన్ఫ్రా టెక్నాలజీస్ సభ్యుడు గంధం గోపాల్ మాట్లాడుతూ ప్రజాభీష్టం మేరకు వారు సూచించిన ప్రతి అంశాన్ని పాటిస్తూ క్వారీయింగ్ చేపడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

భీమునిపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే వారికి న్యాయం జరుగుతుందని రెండవ అదనపు సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ డి. సౌజన్య అన్నారు. శనివారం విధాన్ సే సమాధాన్, న్యాయ విజ్ఞాన్ సంస్థ, జాతీయ మహిళా కమిషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారిణి జయదేవి మాట్లాడుతూ మహిళలు ఏవిధంగా మోసపోతున్నారు, వాటిని ఎలా ఎదుర్కొవాలన్నది వివరించారు. డీఎల్ఎస్ఏ ప్యానెల్ అడ్వకేట్ స్వర్ణ గౌరీ మాట్లాడుతూ బాలికలు ఈవ్‌టీజింగ్‌ను ఎలా ఎదుర్కొవాలో ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఐసీడీఎస్ పీవో ఎం. శ్రీదేవి, తహసీల్దార్ పైలా రామారావు, డీఎల్ఎస్ఏ ప్యానెల్ అడ్వకేట్ కె.రవిశంకర్, ఎంపీడీవో హనుమంతరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జె. రేఖావాణి, వి. ఉమా జానకి, కె. ప్రమీలా, డి. అనిత తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి సౌజన్య

**ఆనందపురం** : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని భీమిలి జడ్జి డి. సౌజన్య అన్నారు. శనివారం స్థానిక మహిళా మండలి భవనంలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి సహకరించండి : డీఈఓ

సింహాచలం,డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల అభివృద్ధిలో విద్యా కమిటీలతో పాటు తల్లిదండ్రులు కూడా భాగస్వామ్యులు కావాలని డీఈఓ ప్రేమ్ కుమార్ కోరారు. అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఎస్ఎంసీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సమాజంలో బడి, గుడికి అధిక ప్రాధాన్యం ఉన్నాయని, అంతా బాధ్యతాయుతంగా ఉండాలని చెప్పారు. అప్పుడే దేశానికి మంచి పౌరులను అందించగలమన్నారు.విద్యాశాఖ ఆర్‌జేడీ బి. విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ పాఠశాలల్లో డ్రాపౌవుట్స్‌ను నిలువరించడంతో పాటు బడి ఈడు పిల్లలను చేర్పించాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల హెచ్ఎం ఇమంది పైడిరాజు, డీసీఈబీ కార్యదర్శి కృష్ణకుమార్, సీఈఓ దేముడుబాబు, ఏపీఓ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## మొగధారమ్మను దర్శించుకున్న ఏపీటీడీసీ ఛైర్మన్

సాగర్‌నగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొగధారమ్మ, శ్రీ మహాలక్ష్మీ అమ్మవార్ల ఆలయాన్ని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఆయనతో పాటు ఏపీటీడీసీ రీజనల్ డైరెక్టర్ రమణ, డీవీఎం జగదీశ్, తదితరులు ఉన్నారు.

## రైఫిల్ షూటింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక

తగరపువలస, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్‌లో వచ్చే నెల 8 నుంచి 18వ తేదీ వరకూ జరగనున్న ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎస్ఆర్ఐ విద్యార్థి ఎంపికయ్యాడు. శుక్రవారం విశాఖలో రైఫిల్ షూటింగ్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో సంగివలస ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న మనోజ్ఞ పది మీటర్ల ఎయిర్ పిస్టల్ షూటింగ్‌కి ఎంపికయ్యారు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని పలువురు అభినందించారు.

## 'జూట్ కార్మికులకు న్యాయం చేయాలి'

తగరపువలస, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్ మిల్లు కార్మికుల సమస్యలపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించాలని మిల్లు లేబర్ యూనియన్ (ఏఐటీయూసీ) కార్యదర్శి కొండపు ఈశ్వరరావు కోరారు. శనివారం ఆ యూనియన్ భవన్‌లో నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పిఎఫ్, గ్రాట్యూటీ, ఫిక్సిడ్ డిపాజిట్లు రావాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జేసీఎల్, పిఎఫ్ అధికారులు, యూనియన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## విపత్తుల పట్ల అప్రమత్తం : తహసీల్దార్

పద్మనాభం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విపత్తులు వచ్చినప్పుడు కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాల నుంచి బయటపడవచ్చని తహసీల్దార్ కె. ఆనందరావు అన్నారు. శనివారం పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర విపత్తుల ప్రతి స్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) 16వ బెటాలియన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్లు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులు, మానవ ప్రేరిత విపత్తులు సంభవించినప్పుడు కొద్దిపాటి మెలకువలు పాటించినట్లయితే వాటి ద్వారా కలిగే నష్టాలను నివారించుకోవచ్చన్నారు. అనంతరం సభ్యులు విపత్తుల నివారణకు వినియోగించే పరికరాల వినియోగాన్ని వివరించారు. కార్యక్రమంలో 16వ బెటాలియన్ రిజర్వు సీఐ టి. రామకృష్ణ, ఎస్ఐ వైకుంఠం, పాఠశాల హెచ్ఎం వెంకటగిరి పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

తగరపువలస, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ జీవీఎంసీ అధికారులు శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. మహాలక్ష్మినాయుడు ఆధ్వర్యంలో చిట్టివలసలో ర్యాలీ చేసి, అనంతరం తగరపువలస జంక్షన్‌లో మానవహారం చేపట్టారు.

## శ్రీనివాసరావు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


గంటా వద్ద విలపిస్తున్న యామిని

భీమునిపట్నం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :కుమార్తె జీవితం బాగా లేకపోవడంతో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన ఇటుక బట్టీ వ్యాపారి బొట్ట శ్రీనివాసరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. టి. నగరపాలెంలో వున్న శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి అతని భార్య, కుమార్తెతో మాట్లాడారు. యామినికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాము, మండల టీడీపీ అధ్యక్షుడు దంతులూరి అప్పల నరసింహరాజు, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, గుడ్డాల ఎల్లయ్య, తమ్మిన సూరిబాబు, పొట్నూరు రాము ఉన్నారు.

**సింహాచలం** : స్టీల్‌ప్లాంటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 98వ వార్డు జర్నలిస్టు మురళీకృష్ణ కుటుంబాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారామ్ శనివారం పరామర్శించారు. వారితో పాటు వార్డు కార్పొరేటర్ పివి నరసింహం ఉన్నారు.

## గీతంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


వర్సిటీ క్యాంపస్‌లో పూర్వ విద్యార్థుల సందడి

సాగర్‌నగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీలో హోమ్ కమింగ్ పేరిట రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు శనివారం ప్రారంభించారు. దేశంలోని పలు ప్రాంతాలతో పాటు విదేశాల్లో ఉంటున్న వారు ఉత్సవాలకు తరలివచ్చారు. ఈ సందర్భంగా గీతం ప్రగతిని, భవిష్యత్తు ప్రణాళికలను అధ్యాపకులు వివరించారు. పూర్వ విద్యార్థులు వర్సిటీ ప్రగతిలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రముఖ సంస్థల్లో కీలక స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులను ముఖ్య అతిథులు సన్మానించారు.అలాగే పారిశ్రామికవేత్తగా ఎదిగిన గీతం పూర్వ విద్యార్థి ఓ. నరేశ్ కుమార్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, డిజైన్ కన్సల్టెంట్ ఎం. అమిత్‌కు విశిష్ట పురస్కారాలను ప్రదానం చేశారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు, స్టాల్స్ కార్యక్రమాలతో వర్సిటీ సందడిగా మారింది.

## రెడ్డిపల్లిలో 'పీఎం సూర్యఘర్ యోజన' సదస్సు

పద్మనాభం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈపీడీసీఎల్ విశాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీరు జి. శ్యామ్‌బాబు అన్నారు. శనివారం ఆయన రెడ్డిపల్లి పంచాయతీలో జరిగిన సోలార్ విలేజ్ అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ కార్యక్రమలో సర్పంచ్ సిగల ఆదిలక్ష్మి, ఉప సర్పంచ్ ఎస్. ఆదిబాబు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, జెడ్పీటీడీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, విద్యుత్ శాఖ ఈఈ పోలాకి శ్రీనివాసరావు. డీఈ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు విజయవంతంగా శస్త్ర చికిత్సలు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైద్యులు

విశాఖపట్నం,డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు సంబంధించిన అత్యంత క్లిష్టమైన సమస్యలకు విజయవంతంగా శస్త్ర చికిత్సలు నిర్వహించామని రెయిన్ బో ఆస్పత్రి చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శాశ్వత మహంతి, డాక్టర్ యశ్వంత్ రెడ్డి, డాక్టర్ శ్రీలత పేర్కొన్నారు. జాతీయ పిల్లల శస్త్ర చికిత్స దినోత్సవం పురస్కరించుకుని ఆస్పత్రి ఆవరణలో శనివారం మీడియాసమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టుకతో వచ్చిన అనేక లోపాలను సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు నిర్వహించి తొలగించామన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 15 మంది పిల్లలకు ఇటువంటి శస్త్ర చికిత్సలు చేసినట్టు తెలిపారు. పుట్టుకతో వచ్చే లోపాలతో చిన్నారులు 10 నుంచి 20 శాతం మంది మృత్యువాత చెందుతారని, వీటికి సరైన సమయంలో శస్త్ర చికిత్స నిర్వహించడం వల్ల సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ తరహా సమస్యల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఏటా జాతీయ పిల్లల శస్త్ర చికిత్స దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 27 వారాలకే నెలలు నిండకుండా పుట్టిన 850 గ్రాములు బరువు కలిగిన శిశువుకు పేగులోని రంధ్రాలకు క్లిష్టమైన శస్త్ర చికిత్స నిర్వహించి కోలుకునేలా చేసినట్టు తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, నిపుణులైన వైద్య బృందంతో మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీశ్ రెడ్డి, డాక్టర్ అశ్వనీతో పాటు చికిత్స చేయించుకున్న చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జైలు ఎదుట ఆందోళన

... 5వ పేజీ తరువాయి

సూపరింటెండెంట్ మహేష్‌బాబు దురుసుగా ప్రవర్తించడంతో పాటు అసభ్యపదజాలంతో దూషించారు. ఆ విషయాన్ని ఇద్దరూ తోటి వార్డర్లకు చెప్పడంతో అందరూ సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో బయటకు వచ్చి ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు దిగారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ విధి నిర్వహణ పేరుతో తమను వేధిస్తున్నారని, అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మిగిలిన అధికారులు వచ్చి వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించి జైలు ఆవరణలోని క్వార్టర్లకు వెళ్లిపోయారు. కొంతసేపటి తర్వాత సూపరింటెండెంట్ తనను ఎవరూ ఏమీ చేయలేరని వ్యాఖ్యానించినట్టు తెలుసుకుని వార్డర్లు తమ కుటుంబసభ్యులతో కలిసి వచ్చి మళ్లీ జైలు ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు దిగారు. వార్డర్లు పక్కన నిలబడితే వారి కుటుంబ సభ్యులు ఆందోళన కొనసాగించారు. రాత్రి పది గంటలకు కూడా ఆందోళన విరమించలేదు. జైళ్ల శాఖ ఉన్నతాధికారులు వచ్చే వరకు కదిలేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. దీనిపై ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మహేష్‌బాబు వివరణ ఇస్తూ ఒకరు విధుల్లోకి వచ్చినప్పుడు తరచూ గంజాయితో వస్తున్నారని, దీనిపై సమాచారం ఉండడంతోనే వారిద్దరినీ తనిఖీ చేశామన్నారు. జైలు నిబంధనలకు లోబడి, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే నడుచుకుంటున్నామన్నారు.


భక్తులతో కిటకిటలాడుతున్న రూ. 300ల క్యూ

## భక్త సంద్రమైన సింహగిరి

సింహాచలం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉత్తరాంధ్ర నలుమూలల నుంచే కాకుండా ఒడిశా, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర నుంచి వందలాది రావడంతో సింహగిరి కిటకిటలాడింది. శనివారం ఒక్క రోజే స్వామివారి ఖజానాకు సుమారు రూ. 35.61 లక్షల ఆదాయం లభించింది. అత్యధికంగా శ్రీఘ్రదర్శనం రూ.100, అతిశ్రీఘ్రదర్శనం రూ. 300 టికెట్ల విక్రయాల ద్వారా రూ. 21.28 లక్షలు రాగా ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.10.99లక్షలు, కేశఖండనశాల తలనీలాల టికెట్ల ద్వారా రూ.1.23 లక్షలు, విరాళాల ద్వారా రూ.1.03 లక్షలు సమకూరింది.

# కూటమి జోరు... వైసీపీ బేజారు

... 5వ పేజీ తరువాయి

ఒక ఎంపీ, ఏడు అసెంబ్లీ స్థానాలు మాత్రమే ఉన్నాయి. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఘోర పరాజయం పొందారు. ఆయనపై అంతకు ముందు ఎన్నికల్లో ఓడిపోయిన శ్రీభరత్ తెలుగుదేశం పార్టీ తరపున మళ్లీ 2024 ఎన్నికల్లోను ఎంపీగా పోటీ చేశారు. నాటి మంత్రి బొత్స సత్యనారాయణ భార్య ఝాన్సీలక్ష్మిని వైసీపీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా నిలిపింది. టీడీపీ అభ్యర్థి శ్రీభరత్ ఐదు లక్షలకు పైగా మెజారిటీతో గెలుపొందారు. విశాఖ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకజవర్గాల్లోను కూటమి అభ్యర్థులే గెలిచారు.తూర్పు నియోజకవర్గం నుంచి వెలగపూడి రామకృష్ణబాబు (టీడీపీ),పశ్చిమ నియోజకవర్గం నుంచి గణబాబు (టీడీపీ), ఉత్తర నియోజకవర్గం నుంచి విష్ణుకుమార్‌రాజు (బీజే పీ), దక్షిణ నియోజకవర్గం నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్ (జనసేన), గాజువాకలో పల్లా శ్రీనివాసరావు (టీడీపీ), భీమిలిలో గంటా శ్రీనివాసరావు (టీడీపీ), పెందుర్తిలో పంచకర్ల రమేశ్‌బాబు (జనసేన) భారీ మెజారిటీతో గెలిచారు. రాజకీయాల్లోకి వచ్చిన తరువాత ఓటమి ఎరుగకుండా వరుసగా ఎంపీగా, ఎమ్మెల్యేగా గెలుచుకుంటూ వచ్చిన ముత్తంశెట్టి శ్రీనివాసరావు భీమిలిలో గంటా శ్రీనివాసరావు చేతిలో ఓడిపోయారు. మంత్రిగా ఉంటూ గాజువాక నుంచి పోటీ చేసిన గుడివాడ అమర్‌నాథ్ టీడీపీ అభ్యర్థి పల్లా చేతిలో చిత్తయిపోయారు. గతంలో అనకాపల్లి నుంచి టీడీపీ తరఫున ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన ఆడారి ఆనందకుమార్ ఈసారి వైసీపీ తరఫున విశాఖ పశ్చిమ నుంచి పోటీ చేసి అపజయం చెందారు.

### ఎన్నికల తరువాత

ఎన్నికలు ముగిసి ఆరు నెలలైంది. ఈమధ్య కాలంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారు. ఎమ్మెల్యే గణబాబుకు విప్‌గా అవకాశం ఇచ్చారు. ఇంకా కూటమి నాయకులు అనేక మందికి కార్పొరేషన్ పదవులు లభించాయి. జిల్లా పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా, దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు వైస్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్‌కు వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ పదవి లభించింది. జనసేన నాయకుడు శివశంకర్‌కు చిన్న, మధ్య తరహా పరిశ్రమల కార్పొరేషన్ ఛైర్మన్ పదవి దక్కింది. విశాఖ డెయిరీపై తెలుగుదేశం నాయకులు విచారణ కోరడం, సభా సంఘం వేయడంతో ఉక్కిరిబిక్కిరి అయిన ఆడారి ఆనందకుమార్ టీడీపీలోకి రావాలని ప్రయత్నించారు. అవకాశం లభించకపోవడంతో బీజేపీ కండువా కప్పుకున్నారు. దీనికి రెండు వారాల ముందు భీమిలి మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైసీపీకి గుడ్‌బై చెప్పేశారు. ఇదిలావుండగా వైసీపీ జిల్లా అధ్యక్షునిగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌ను నియమించింది. అలాగే ఉమ్మడి జిల్లా సమన్వయకర్త బాధ్యతల నుంచి వైవీ సుబ్బారెడ్డిని తప్పించి మళ్లీ విజయసాయి రెడ్డికి అప్పగించింది. స్థానిక సంస్థల కోటా నుంచి బొత్స సత్యనారాయణ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

# పథకం ప్రకారమే గ్రీన్ బెల్ట్ కొట్టేశారు

... 5వ పేజీ తరువాయి

ముందున్న గ్రీన్ బెల్ట్‌ను కలిపేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు సమర్పించిన ప్లాన్‌లోనే గ్రీన్ బెల్ట్‌ను ఏ విధంగా వాడుకుంటారనేది వివరించారు. 80 అడుగుల పొడవైన గ్రీన్ బెల్ట్‌లో 20 అడుగులు వాటర్ ఫౌంటెయిన్, 30 అడుగుల పొడవుతో ఒక డ్రైవ్ వే, ఇంకో 30 అడుగుల పొడవుతో మరో డ్రైవ్ ఏర్పాటు చేయనున్నట్టు ప్లాన్‌లో చూపించారు. జాతీయ రహదారి నుంచి షాపింగ్ మాల్‌కు మూడు మార్గాలు నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. అంటే వారి భూమికి ముందు ఎంత వెడల్పున గ్రీన్ బెల్ట్ ఉందో అంతా ఉపయోగించుకుంటామని ప్లాన్‌లో వివరించారు. ఆ గ్రీన్ బెల్ట్ భూమి జీవీఎంసీకి సంబంధించినది. వారి అనుమతి లేకుండానే, వారితో ఎటువంటి ఒప్పందం లేకుండానే దానిని ఉపయోగించుకుంటామని ప్లాన్ పెట్టారు. అలాగే గ్రీన్‌బెల్ట్ నుంచి దారి కోసం భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు దరఖాస్తు చేశారు. ప్లాన్‌లో మార్గాలు చూపించి, ఎన్‌హెచ్ఏఐకు నాలుగు మార్గాలు కావాలని కోరారు. దానికి వారు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్ఓసీ) మాత్రమే ఇచ్చారు. మాల్‌కు మార్గం ఏర్పాటు చేసుకోవడానికి తమకు అభ్యంతరం లేదని, కాకపోతే ఆ భూమి ఎవరిదో వారి నుంచి అనుమతి తీసుకోవాలని, ఆ గ్రీన్ బెల్ట్ తొలగింపునకు అటవీ శాఖ అనుమతి తీసుకోవాలని స్పష్టంచేశారు. ఈ విషయాన్ని ఈ నెల 23న విశాఖ ఎంపీ శ్రీభరత్ సమక్షంలో జరిగిన సమావేశంలో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రశ్నించినప్పుడు ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ స్పష్టంచేశారు. తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, కేవలం ఎన్ఓసీ ఇచ్చామని పేర్కొన్నారు. అంటే ఆ భూమి యజమాని అయిన జీవీఎంసీయే దానిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదే సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కూడా ఉన్నారు. కలెక్టర్ స్పందించి ఎంక్వయిరీ వేయాలని విష్ణుకుమార్‌రాజు కోరారు. దానికి ఆయన అంగీకరించారు.

### ఆ భూమి విలువ రూ.60 కోట్లు

- పి.విష్ణుకుమార్‌రాజు,
ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే

మెగా షాపింగ్‌మాల్ యాజమాన్యం ప్రభుత్వానికి చెందిన రూ.60 కోట్ల విలువైన భూమి (గ్రీన్ బెల్ట్)ని కలిపేసుకుంది. గ్రీన్ బెల్ట్ నుంచి నాలుగు దారులు ఏర్పాటు చేసుకుంటామని చెప్పి 3,964 చ.అడుగుల భూమిని సిమెంట్ కాంక్రీట్‌గా మార్చి డ్రైవ్ వేలు నిర్మించుకుంది. ఆ భూమి జీవీఎంసీకి చెందినది. వారు స్పందించడం లేదు. కూటమి నాయకుల ఫ్లెక్సీలు నిర్మాణం ముందు పెట్టారని తెలిసి వెళ్లి చూశాను. నా ఫొటో కూడా ఉంది. మొత్తం అందరివీ తీసేయాలని చెప్పి తొలగింపజేశాను. అయితే వారు మళ్లీ నా ఒక్క ఫొటో తప్ప ఇతర నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలు పెట్టారు. వాటితో అధికారులను బెదిరిస్తున్నారు. 1,500 మందికి ఉపాధి కల్పిస్తే ప్రభుత్వ భూమిని కలిపేసుకుంటారా? దానిని అధికారులు ఆమోదిస్తారా?, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరగాలి.

# శభాష్ నితీశ్

... 5వ పేజీ తరువాయి

వ్యక్తిగత స్కోరు 99 పరుగుల వద్ద బోలండ్ బౌలింగ్‌లో మిడాన్ మీదుగా బౌండరీ బాది టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీ సాధించాడు. నితీశ్‌కుమార్‌రెడ్డి సెంచరీ చేయడంతో స్టేడియంలో భారత్ క్రీడాభిమానుల గ్యాలరీ స్టాండ్ కేరింతలు, చప్పట్లతో దద్దరిల్లింది.

### సిరీస్‌లో అమోఘంగా రాణిస్తున్న నితీష్‌కుమార్ రెడ్డి

ఈ సిరీస్‌లో నితీశ్‌కుమార్‌రెడ్డి అమోఘంగా రాణిస్తున్నాడు. కెరీర్‌లో తొలి టెస్ట్ సిరీస్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో ప్రపంచ దిగ్గజ క్రికెటర్ల ప్రశంసలు అందుకుంటున్నాడు. పెర్త్‌లో జరిగిన తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 41, రెండో ఇన్నింగ్స్‌లో 38 (నాటౌట్) పరుగులో రాణించి జట్టు విజయంలో కీలకపాత్ర వహించాడు. ఆడిలైట్‌లో జరిగిన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 42 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 42 పరుగులు చేశాడు.

## వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



సాగర్‌నగర్ : రుషికొండలో ఉన్న శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు శనివారం పోటెత్తారు. నగరంలోని పలు ప్రాంతాలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం నుంచి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

## నిర్మాణ వ్యర్థాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



డెబ్రిస్ తొలగించిన మలేరియా సబ్ యూనిట్ పాత కార్యాలయం రోడ్డు

మద్దిలపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీ మలేరియా సబ్ యూనిట్ కార్యాలయం రోడ్డులో పడి ఉన్న డెబ్రిస్‌ను తొలగించారు. ఈ సమస్యలపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకున్నారు. రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు పడేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## కూలిన పాఠశాల ప్రహరీ గోడ

» పునరుద్ధరణకు ఎమ్మెల్యే వెలగపూడి ఆదేశం



కూలిన ప్రహరీ

ఆరిలోవ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ అంబేడ్కర్ జంక్షన్‌లోని మండల ప్రాథమికపాఠశాల ప్రహరీ కూలిపోయింది. ఈ ప్రాంతంలో ఉదయం వేళలో కొందరు చిరు వర్తకులు వ్యాపారాలను చేస్తుంటారు. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సుమారు 7 అడుగుల ఎత్తుతో ఉన్న 30 అడుగుల మేర ప్రహరీ అధిక భాగం కూలిపోవడంతో పెద్ద శబ్దం వినిపించింది. ఆ శబ్దానికి ఏం జరిగిందో తెలియక స్థానికులు ఆందోళన చెందారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోడ బాగా కరిగిపోవడంతో కుప్పకూలి ఉంటుందని భావిస్తున్నారు.

ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్పందించారు. వెంటనే ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వెంటనే నిధులు విడుదల చేసి శనివారం నుంచే పనులు ప్రారంభించాలనిఅధికారులను ఆదేశించారు.

## నేడు కళాభారతిలో భువన విజయం ప్రదర్శన

మద్దిలపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం భువన విజయం సాహితీ నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు కళాభారతి నిర్వాహకులు ఎం.రాంబాబు తెలిపారు. ఏడాది ముగింపు సందర్భంగా ఈ సాహితీ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం కాలమాన పరిస్థితుల్లో సాహిత్యానికి ప్రాధాన్యం కరువైందని, అందుకే ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఉచిత ప్రవేశంతో సాహితీ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. కళాభిమానులు, ప్రజలు సాయంత్రం 6.15 గంటలకు ప్రారంభమయ్యే భువన విజయాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## సినిమా గైడ్

● **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)

● **విడుదల-2:** శ్రీకన్య వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)

● **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

● **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 20, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 34, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 40, బీరకాయలు 52, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 40 దొండకాయలు 50, బంగాళదుంపలు 26, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)50, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 30 దోస కాయలు 28, వె ల్లుల్లి (పెద్దవి) 270, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, పొటల్స్ 60, కీరదోస 30, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 36, కంద 60, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45

| కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో) | |
|---|---|
| విశాఖపట్నం | 600 |
| విజయనగరం | 604 |
| శ్రీకాకుళం | 604 |

| చికెన్ ధరలు (బ్యాగ్) | |
|---|---|
| రైతు ధర | 102 |
| లైవ్ ధర | 122 |
| విత్ స్కిన్ | 214 |
| స్కిన్‌లెస్ | 224 |

# న్యాయమైన భూ సమస్యలు సత్వరమే పరిష్కారం

» గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు నిర్వీర్యం » రెవెన్యూ సదస్సులో అధికారులకు ఎంపీ శ్రీభరత్ ఆదేశం




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, వేదికపై ఎమ్మెల్యే రామకృష్ణబాబు, ఎమ్మార్వో రమేశ్, జడ్సీ-3 శివప్రసాద్, కార్పొరేటర్లు

వెంకోజీపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : న్యాయమైన భూ సమస్యలను తప్పనిసరిగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఆదేశించారు. శనివారం 16వ వార్డు కార్యాలయం వద్ద 15, 16, 17 వార్డులకు సంబంధించిన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ అధికారులు ఎవరి ఒత్తిళ్లకు లొంగాల్సిన పని లేదని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమన్నారు. ఎలాంటి వివాదాలు, తాత్సారం లేకుండా భూసమస్యలు పరిష్కారం అయ్యేందుకు రెవెన్యూ సదస్సులు చక్కని వేదికలన్నారు. గడిచిన ఐదేళ్లలో ఎన్నో భూ సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడ్డారని, కానీ ఇప్పుడు మంచి రోజులు వచ్చాయన్నారు. ప్రజలు ధైర్యంగా భూసమస్యలను పరిష్కరించుకునే సమయం వచ్చిందన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో భూయజమానుల నుంచి వచ్చిన ప్రతి వినతికి రశీదు ఇస్తారని, అనంతరం అధికారులు పరిశీలించి 45 రోజుల్లో పరిష్కరిస్తారన్నారు.

ఈ సందర్భంగా పలువురు స్థానికులు పాల్గొని సర్వే నెం. 50/8, 46/1 వంటివి 22ఏ లో ఉంచారని, 55/2 వంటివి యూఎల్‌సీ ఉన్నాయని, సర్వే నెంబరు 23 పాత వెంకోజీపాలేనికి చెందినవి గ్రామ కంఠంలో ఉన్నాయని వీటిని వెంటనే పరిష్కరించి తమకు న్యాయం చేయాలని సదస్సులో కోరారు. సర్వే నెంబరు 23 పాత వెంకోజీపాలేనికి చెందిన వారు తమ సమస్యలను పరిష్కరించాలంటూ వినతులు సమర్పించారు. జీవీఎంసీ 15వ వార్డు కొండవాలు ప్రాంతానికి చెందిన వారు మాట్లాడుతూ సింహాచలం దేవస్థానానికి సంబంధించిన తమ ఇళ్లకు పట్టాలు ఇవ్వలేదని, పక్క ప్రాంతమైన అడవివరం వద్ద ఇళ్ల పట్టాలు మంజూరు చేశారన్నారు. అలాగే 16వ వార్డు భానునగర్‌లో 450 గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని, దీనిపై కోర్టు తమకు అనుకూలంగా తీర్పు చెప్పినా అధికారులు అమలు చేయడం లేదని ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా మూడు వార్డుల నుంచి సుమారు 300 మంది వినతులు సమర్పించారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మార్వో ఎం.రమేష్, సర్వేయర్ సత్యనారాయణ, శ్రీను, జీవీఎంసీ జోన్-3 కమిషనర్ శివప్రసాద్, దేవస్థానం సీతమ్మధార మండల ఎగ్జిక్యూటివ్ అధికారి గాయత్రి, 15, 23 వార్డుల కార్పొరేటర్లు అప్పారి శ్రీవిద్య, గుడ్ల విజయరెడ్డి, నాయకులు బుగత సత్యనారాయణ, నారు గోపి, గుడ్ల సత్యారెడ్డి, ముగడ వాసు, పల్లా ఉమారాణి, మళ్ల రవికుమార్, అప్పారి గిరిబాబు, కాళ్ల శంకర్, బోర ధనరెడ్డి, అప్పన్న, మొల్లి శంకర్, మొల్లి శోభ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

## ఉత్తమ పోలీసింగ్‌కు అన్ని శాఖల సహకారం అవసరం

» నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు ఉత్తమ పోలీసింగ్ సేవలను అందించడానికి అన్ని ప్రభుత్వ శాఖల సహకారం అవసరమని సీపీ శంఖబ్రత బాగ్చి అభిప్రాయపడ్డారు. సిరిపురం కూడలిలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వార్షిక నేర సమీక్ష సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పోలీసులు నిర్వర్తించే అనేక రకాల విధుల్లో న్యాయశాఖ, నేవీ, అగ్నిమాపక, జైళ్ల శాఖల సహకారం అవసరం ఉంటుందన్నారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్‌తో పాటు నేవీ, అగ్నిమాపక, జైళ్ల శాఖల అధికారుల సమక్షంలో ఒక్కో పోలీస్ స్టేషన్ వారీగా నమోదైన కేసులు, పరిష్కరించినవి, కోర్టులో పెండింగ్ ఉన్న కేసులు, శిక్ష పడిన కేసుల వివరాలను ఆయా స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## అలరించిన అన్నమాచార్య కీర్తనల గానాలాపన



కీర్తనలు ఆలపిస్తున్న గాయనీగాయకులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు భద్రం పార్కులో రుషిపీఠం సత్సంగం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీవేంకటేశ్వర వైభవం ఉదయాస్తమాన సేవా ఉత్సవాలలో శనివారం అన్నమాచార్య గీతాలార్చనతో పరిసరాలు పులకరించాయి. భక్తుల గోవిందనామ మార్మోగింది. వేల సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి పారవశ్యంలో తేలియాడారు. అభేది రాగం ఆదితాళం కీర్తన... 'ఏమని పొగడుదుమే ఇక నిను ఆమని సొబగుల అలిమేల్ మంగ.' వంటి కీర్తనలతో గాయకులు వినసొంపుగా ఆలపించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కేవీ శ్యామ్ ప్రసంగిస్తూ తనని నమ్మి కొలిచే భక్తులకు స్వామి సకల భాగ్యాలు ప్రసాదిస్తాడని పేర్కొన్నారు. 24 గంటల నిరంతర అన్నమయ్య గీతాలార్చన చేసి, గిన్నిస్ రికార్డు సాధించిన రత్నమాలను వేదికపై అభినందించారు. మూడో రోజైన శనివారం శ్రీవేంకటేశ్వరస్వామి వసంతోత్సవం, అష్టదళపాదపద్మారాధన, శ్రీవేంకటేశ్వర స్వామి వ్రతం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా పాల్గొన్నారు.

## ఏయూలో గుణపత్తా యాత్ర



మాట్లాడుతున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ గుణాత్మక మండలి భాగమైన 'నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ ల్యాబొరేటరీస్' (ఎన్ఏబీఎల్) ఆధ్వర్యంలో ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో సంయుక్తంగా ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్, దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించే గుణపత్తా యాత్ర నిర్వహించారు. ఏయూ వీసీ జి.శశిభూషణరావు లేబరేటరీల సాంకేతిక సామర్థ్యాన్ని ఎన్ఏబీఎల్ ధ్రువీకరణ ద్వారా ఎలా అంగీకరించబడుతుందో, ఇది ఎలా ముఖ్యమైనదో తెలియజేశారు ఏయూలోని ప్రయోగశాలలను ఎన్ఏబీఎల్ ప్రమాణాలు అను గుణంగా ప్రామాణికరించే దిశగా చర్యలు తీసుకుంటామ చెప్పారు. త్వరలో ఏయూలో ప్రారంభించనున్న ఫుడ్ టెస్టింగ్ ఫార్మా టెస్టింగ్ లేబరేటరీలో ఎన్ఏబీఎల్ గుర్తింపును తీసుకుంటామని చెప్పారు. ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఇన్‌చార్జి హెడ్ ప్రొఫెసర్ సీఎన్‌వీ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రయోగశాలలకు ఎన్ఏబీఎల్ గుర్తింపు ఎంతో అవసరమన్నారు.ఎన్ఏబీఎల్ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డిమాట్లాడుతూ బెంగళూరులోని ఎన్ఏబీఎల్ ప్రాంతీయ కార్యాలయాన్ని, అక్రిడిటేషన్‌పై అవగాహన కల్పించారు. ఎన్ఏబీఎల్, క్యూసీ ఐ, దాని బోర్డులు, విభాగాలు, ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ ప్రాసెస్, దాని ప్రయోజనాలను వివరించారు. ఎన్ఏబీఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీరామ్ మాట్లాడుతూ అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడంలో దశలు,విధానాల గురించి వివరించారు.




## సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలి : డీఈవో ప్రేమ్‌కుమార్



వివరాలు వెల్లడిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్, డీవోఈవో తదితరులు

ఆరిలోవ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలలో నిర్వహించనున్న సైన్స్ ఫెయిర్ 2024-25ను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు . శనివారం తోటగరువు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్ ఏర్పాట్ల గురించి వివరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 8 నుంచి పదో తరగతి విద్యార్థులకు సైన్స్ ఫెయిర్‌కు హాజరయ్యేలా చూడాలన్నారు. ఇవి మూడు దశల్లో ఉంటాయన్నారు. డిసెంబరు 30న పాఠశాల స్థాయి, 31న మండల స్థాయి, జనవరి 3న జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఫిజిక్స్ కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, స్పేస్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఇంజనీరింగ్, బయో కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అంశాలకు సైన్స్ ఫెయిర్‌లో స్థానం ఉంటుందన్నారు. సమావేసంలో డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, ఏడీ-1 అరుణజ్యోతి, చినగదిలి ఎంఈవో సీహెచ్ రవీంద్రబాబు, డీసీబీ బోర్డు కార్యదర్శి ఎంవీ కృష్ణకుమార్, జిల్లా సైన్స్ అఫీసర్ కె.ప్రసాద్, పీఈవో సునీత, తోటగరువు హైస్కూలు హెచ్‌ఎం దుర్గాభవానీ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా కళాశాలకు పుస్తకాలు వితరణ



పుస్తకాలు అందజేస్తున్న అధ్యాపకురాలు పద్మావతి

మద్దిలపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బోటనీ అధ్యాపకురాలు ఎస్.పద్మావతి విలువైన పుస్తకాలు వితరణ చేశారు. చారిత్రక గ్రంథాలు,జీవితగాథలు, తెలుగు సాహిత్య పుస్తకాలను ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను వితరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల గ్రంథాలయంలో విద్యార్థులు చదువుకోవడానికి ఈ పుస్తకాలను అందుబాటులో ఉంచనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు కె.రవిబాబు, పి.ఉమామహేశ్వరరావు, ప్రతాప్ పాల్గొన్నారు.

## పకడ్బందీగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం

» జనవరి 1 నుంచి అమలు మేయర్ హరి వెంకటకుమారి



జూట్ బ్యాగ్‌లను పరిశీలిస్తున్న మేయర్, జీవీఎంసీ కమిషనర్

వెంకోజీపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో జనవరి 1వ తేదీ నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించడమైనదని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి స్పష్టం చేశారు. శనివారంఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్‌తో కలిసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువలపై ప్రత్యామ్నాయాలు, ఇన్‌స్పెక్షన్ సిద్ధాంతాలు స్కిల్ అప్ గ్రేడేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ యావత్ ప్రపంచానికి సమస్యగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని విశాఖ నగరం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ జనవరి 1వ తేదీ నుంచి నిబంధనల ప్రకారం 120 మైక్రాన్ల లోపు వున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించనున్నట్టు చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే అపరాధ రుసుంతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దీనిపై ఇప్పటికే ప్రజలకు 45 రోజల పాటు అవగాహన కల్పించామన్నారు.

అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల ఎదురయ్యే అరోగ్యపరమైన దుష్పరిణామాలను కేజీహెచ్ చర్మ వ్యాధి వైద్యులు ప్రొఫెసర్ రాజు, అంకాలజీ ప్రొఫెసర్ కుమారి వివరించారు. సెంటర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్, హెడ్ డాక్టర్ చంద్రశేఖర్ ప్లాస్టిక్ వస్తువులలో రకాలు, వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్లు, ఏఎంవోహెచ్‌లు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేత



దేవరాజుకు చెక్ అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, డిసెంబరు 28 : జీవీఎంసీ 11వ వార్డులోని అన్నా నగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న రాచకొండ దేవరాజు అనే యువకుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.9 లక్షలకు సంబంధించిన చెక్‌ను ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అందజేశారు. కాలు పోవడంతో నడవలేని స్థితిలో ఉన్న దేవరాజుకు కృత్రిమ కాలు అర్చే అమర్చేందుకు ఈ మొత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైంది. ఈ చెక్‌ను రోగి ఇంటికి ఎంపీ, ఎమ్మెల్యే వెళ్లి అందించడం విశేషం. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ 11వ వార్డు అధ్యక్షుడు ఎం.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## సాగరతీరంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



స్నేహితులతో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్

రామ్‌నగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సాగరతీరంలో అపూర్వ కలయికతో పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి, అన్నపూర్ణ ట్యుటోరియల్ (ఏటీ) కళాశాలలో 1998లో చదువుకున్న విద్యార్థులు శనివారం విశాఖ బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. అలనాటి విద్యార్థులు 26 ఏళ్ల తర్వాత కలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ బ్యాచ్‌కు చెందిన ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ కూడా ఉండడం విశేషం. తమ మిత్రుడు ఎమ్మెల్యే కావడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. అశోక్ సైతం తాను ఎమ్మెల్యే అని కాకుండా తమ స్నేహితులతో ఆద్యంతం ఆటపాటలతో ఆనందంగా గడపారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పించిన అలనాటి ఉపాధ్యాయులు సుబ్బారావు, వరలక్ష్మి, ప్రసాద్, బాల సత్యవతులను ఘనంగా సత్కరించారు.

## భక్తిపారవశ్యంగా సంగీత కచేరీ

వెంకోజీపాలెం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం ఎంఎటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన భక్తి కీర్తనలు అలరించాయి. గోవింద నామ స్మరణంతో ఆలపించిన ఈ కీర్తనలు ఆలయానికి విచ్చేసిన భక్తులకు భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. తెల్లవారు జాము నుంచి స్వామి వారికి విశేష అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ, వంశీకృష్ణ ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి వివిధ పుష్పాలతో, తులసిమాలలతో కనువిందుగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆరిలోవ. డిసెంబరు 28 ( ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 12వ వార్డులో గల సాలిపేటలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శనివారం శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాలు, పచ్చదనం పెంపొందించేందుకు ల్యాన్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఇందుకోసం రూ.20 లక్షల జీవీఎంసీ నిధులు వెచ్చించనున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని చూస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీఈ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, టీడీపీ విశాఖ పార్లమెంటరీ కార్యదర్శి ఒమ్మి పోలారావు, నేతలు, ఏడువాక సన్యాసిరావు, ఒమ్మి అప్పలరాజు, ఎస్సీ సెల్ కార్యదర్శి బుడుమూరు గోవింద్, స్థానిక నాయకులు నీలి పోలారావు, గణేష్, ఆనంద్, తెలుగు మహిళా నేతలు, ఏఈ వెంకటరావు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన




అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెంకోజీపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఏయూ తెలుగు మీడియం హైస్కూల్‌లో ట్రాఫిక్ వారోత్సవాలు పురస్కరించుకుని ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు, డాక్టర్ శశిప్రభ ఫ్రిపా ట్రస్టు ఎంఈవో పుష్యరాగం, ప్రసాద్, నరసింగ్, భాస్కర్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.సులోమి విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

## మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా: వంశీకృష్ణ


ఆర్చ్ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

జ్ఞానాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తానని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గ్రేటర్ 32వ వార్డు భీమ్‌నగర్‌లోనూ, సాయిబాబా, వినాయక ఆలయాల వద్ద ఆర్చ్‌లను శనివారం ఆయన ప్రారంభించారు. వంశీకృష్ణ మాట్లాడుతూ వార్డు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు, ఏఈ తేజస్విని, వర్క్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు, కందుల రాజశేఖర్, నారా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## విజయ్ హజారే క్రికెట్ ట్రోఫీలో విదర్భ గెలుపు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయ్ హజారే ట్రోఫీ టోర్నీలో భాగంగా ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో విదర్భ ఐదు వికెట్ల తేడాతో చండీగర్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన చండీగర్ నిర్ణీత 50 ఓవర్లలో నాలుగు వికెట్లకు 315 పరుగుల స్కోరు చేసింది. ఓపెనర్ మనన్ వొహ్రా సెంచరీ (101) సాధించగా, మిడిల్ ఆర్డర్‌లో ఎ.కె.కౌశిక్ (59- నాటౌట్), అమృత్‌లాల్ లుబానా (58-నాటౌట్) అజేయ అర్ధ సెంచరీలతో రాణించారు. భారీ లక్ష్యాన్ని విదర్భ ఆటగాళ్లు 48 ఓవర్లలో ఐదు వికెట్లు నష్టపోయి 316 పరుగులు చేసి సునాయాసంగా ఛేదించి అనూహ్య విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఓపెనర్ ధ్రువ్ షోరే (57) హాఫ్ సెంచరీ చేయగా, వన్‌డౌన్‌లో దిగిన కెప్టెన్ కరుణ్‌నాయర్ అజేయ భారీ సెంచరీతో (163 నాటౌట్) జట్టుకు విజయాన్నందించాడు.

## కుట్టుశిక్షణ మహిళలకు ధ్రువపత్రాల పంపిణీ

పూర్ణామార్కెట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జనసంస్థాన్ శిక్షణ కేంద్రం, బాలవికాస్ సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన తరగతుల్లో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం ధ్రువపత్రాలు అందజేశారు. పాతనగరం బాలవికాస్ సేవా సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వన్‌టౌన్ సీఐ దేముడుబాబు పాల్గొని వీటిని అందచేశారు. ఇలాంటి శిక్షణ పొందడం వల్ల మహిళలు స్వయంగా జీవించగలిగే అవకాశం ఉంటుందని సీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస్ ఫౌండేషన్ ప్రతినిధి నరవ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సమాఖ్య సభ్యులు మరింత ప్రగతి సాధించాలి: చందు

అక్కయ్యపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 46వ వార్డు శాంతినగర్‌లో కలాంజియా సమాఖ్య సభ్యుల సమావేశం శనివారం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా నేషనల్ పోర్టు ట్రస్ట్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు హాజరై ప్రసంగించారు. కలాంజియా సభ్యుల లావాదేవీలు, పొదుపు, అప్పులు, సభ్యుల ఆరోగ్యం, ఎల్ఐసీ ప్రీమియం చెల్లింపు, సభ్యులు సాధించాల్సిన ప్రగతిని వివరించారు. అనంతరం బియ్యం, నిత్యావసర వస్తువులు, నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దూది నరసింగరావు, బీవోడీలు వెంకటలక్ష్మి, కె.వరదేశమ్మ, కనకమహాలక్ష్మి, బి.లక్ష్మి, ఎండీ పృధ్వీ, ఎం. హరిణి తదితరులు పాల్గొన్నారు.

## గాయపరిచిన వ్యక్తికి రిమాండ్

సీతంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో సంపత్ మహేశ్వరి అనే వ్యక్తిని కత్తితో గాయపరిచిన వాచ్‌మన్ చిన్నారావును పోలీసులు శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించింది. నీరు వృథా చేయడమెందుకని సంపత్ ప్రశ్నించడంతో ఆగ్రహించిన వాచ్‌మన్ దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా రు. నాలుగో పట్టణ సీఐ ఎ.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు వన సమారాధన

మాధవధార, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోర్టు అండ్ డాక్‌యార్డు పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మాధవధారలో వనసమారాధన ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు చౌదరి అప్పారావు తెలిపారు. మాధవస్వామి తోటల వద్ద ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు జరిగే వన సమారాధనకు సంఘ సభ్యులు కుటుంబాలతో హాజరు కావాలన్నారు.

## ద్రోణంరాజుకు ఘన నివాళి


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జ్ఞానాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ద్రోణంరాజు సత్యనారాయణ 19వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించి పలువురు నివాళులర్పించారు. వైసీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవాత్సవ్ ఆధ్వర్యంలో వారి స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ద్రోణంరాజు సత్యనారాయణ చిత్రపటానికి 41వ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. వేలంగిణీరావు, చుక్కా శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కనక మహాలక్ష్మి రథయాత్ర


అమ్మవారి రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఈవో కె.శోభారాణి, ఆలయ అధికారులు తదితరులు


రథయాత్ర ఊరేగింపులో వివిధ వేషధారణలతో నృత్యం చేస్తున్న కళాకారులు

జగదాంబ కూడలి/మహారాణిపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసోత్సవాలు ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో శనివారం కనకమహాలక్ష్మి అమ్మవారి రథయాత్ర వైభవంగా జరిగింది. అమ్మవారి దత్తత దేవాలయం మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి దేవస్థానం నుంచి కనకమ్మ రథం భక్తుల జయజయ ధ్వనులతో కదిలింది. రథంపై ఉత్సవమూర్తిని సుందరంగా అలంకరించి, మేళతాళాలు, తప్పెటగుళ్ల, కోలాటాల సందడితో ఊరేగింపు నిర్వహించారు. జగదాంబ జంక్షన్ నుంచి మెయిన్ రోడ్డు గుండా బురుజుపేట అమ్మవారి ఆలయానికి చేరుకుంది. యాత్రలో ఉత్సవమూర్తిని మహిళలు మొక్కుకున్నారు. అంతకుముందు రథయాత్రను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఈవో కె.శోభారాణి, ఇంజనీరు రమణ, జేఈవో తిరుమలేశ్వరరావు, సమక్షంలో జెండా ఊపి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. ఉదయం నుంచి పెద్దసంఖ్యలో అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్నారు.

## సైబర్ నేరాలతో జాగ్రత్త


రైతులకు అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

అక్కయ్యపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల దినోత్సవం సందర్భంగా గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో ఎస్టేట్ అధికారి కొండబాబు ఆధ్వర్యంలో శనివారం రైతులకు, వినియోగదారులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వినియోగదారుల సంఘాల జిల్లా చైర్మన్ మర్రి సత్యనారాయణ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో మోసపోకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వినియోగదారుల సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్ 1967ను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100, 0891 2575046 ఫోన్ నెంబర్లకు ఫిర్యాదు చేసి రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రైతుబజారు సహాయకుడు ఆర్.సత్యనారాయణ, రైతులు నాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆ రహదారిలో ఎన్ని అవస్థలో..!


రహదారి మలుపులో ఏర్పాటు చేసిన చెత్తడబ్బా

సీతంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట శాంతిపురంలో రహదారులు గోతులు పడడం, మలుపులో చెత్తబుట్టలు పెట్టడంతో స్థానికుల రాకపోకలకు అసౌకర్యంగా ఉంటోంది. శాంతిపురం స్కీమ్ బిల్డింగ్ నుంచి కాలనీలోకి వెళ్లే రహదారి మలుపులో చాలా కాలం కిందట పెద్ద గొయ్యి పడింది. ఆ గొయ్యి పెద్దది కావడంతో అటుగా ప్రయాణించడం ప్రమాదకరంగా మారింది. శాంతిపురం కాలనీలోకి వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో పాటు స్కీమ్ బిల్డింగ్‌ల నుంచి శాంతిపురం వెళ్లే మార్గంలో వాహనాలు రాత్రి పూట గొయ్యిలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. శాంతిపురం సిగ్నల్ పాయింట్ నుంచి క్రౌన్ బ్యాకరీ దాటిన తరువాత శాంతిపురం వీధిలో తిరిగే మలుపులో రహదారికి అడ్డంగా చెత్తబుట్ట పెట్టడం, అక్కడే వ్యర్థాలు వేస్తుండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గొయ్యిని కప్పించి, మలుపులో చెత్తబుట్టను తొలగించి రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు.

# అబ్బురపరచిన నృత్య ప్రదర్శనలు

డాబాగార్డెన్స్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆలోచనలు రేకెత్తించేలా వివిధ దేశాల నృత్య ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలోని నటరాజ్ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ఐటీడీసీ-2024 నృత్య ప్రదర్శనలు ఔరా! అనిపించాయి. కొన్ని నృత్యాలు రసజ్ఞుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. నృత్యోత్సవ నిర్వహణ నిపుణులు సాయి వెంకటేష్, జగబంధు జెనా, కాశ్మీరా త్రివేదీ, డాక్టర్ కళాకృష్ణ, డాక్టర్ కేశవరాజు బాలకృష్ణన్, డాక్టర్ పి.రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి రెండో రోజు వేడుకలను ప్రారంభించారు. కూచిపూడి, భరతనాట్యం రీతులలో సీనియర్, జూనియర్, బృంద విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 33 మంది ఆహూతులను మైమరపించారు.



సంప్రదాయ కూచిపూడి నృత్య రీతులలో కళాకారిణుల అభినయం


ఆహూతులను తన్మయులను చేసిన కళాకారిణుల నృత్య ప్రదర్శన

## కులశేఖర్ మరణం బాధాకరం


కులశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

సీతంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన సినీ గీత రచయిత కులశేఖర్ సంస్మరణ సభను శనివారం ద్వారకానగర్‌లోని బీవీకే కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కులశేఖర్ సహచర విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తీవ్ర సంతాపం వెలిబుచ్చి మౌనం పాటించారు. ఆయన మరణం బాధాకరమన్నారు. జనరంజకమైన పాటలు రాసిన కులశేఖర్‌తో తమకున్న పరిచయాలను, అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కులశేఖర్‌కు బాల్యం నుంచి సంగీత సాహిత్యాలపై ఆసక్తి ఉండేదని, చదువుకునే రోజుల్లో పాటలు రాసి అనేక బహుమతులు పొందారని సహచర విద్యార్థులు తెలిపారు. చదువు తర్వాత జర్నలిస్టుగా సేవలందించారని, తర్వాత తేజ దర్శకత్వంలో ఉషాకిరణ్ మూవీస్ పతాకంపై రామోజీరావు నిర్మించిన చిత్రం సినిమాతో గీత రచయితగా పరిచయం అయ్యారని గుర్తు చేసుకున్నారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి దగ్గర శిష్యరికం చేస్తూ సినీ గీత రచనలో మెలకువలు నేర్చుకుని అనేక విజయవంతమైన సినిమాలకు పాటలు రాశారని సన్నిహితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భారతీయ విద్యా కేంద్రం చైర్మన్ నాగేశ్వరరావు, కోశాధికారి శ్రీధర్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, సత్యారావు, విశ్రాంత ఆచార్యులు పిల్ల రమణమూర్తి, కృష్ణాచారి, ప్రిన్సిపాల్ రత్నశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల టేబుల్ టెన్నిస్ టోర్నీకి ఏయూ జట్టు


ఎంపికైన జట్టు సభ్యులతో ప్రముఖులు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల మహిళల టేబుల్ టెన్నిస్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టును శనివారం ప్రకటించారు. ఎంఏఈటీ యూనివర్సిటీలో జరిగే ఈ టోర్నీలో ఏయూ జట్టుకు గుణ సంయుక్త, దీప్తి, అశ్విద, యోషిక, వినీత ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ జట్టుకు మురళీ పాత్రో కోచ్‌గా ఉంటారు. శనివారం జట్టు సభ్యులను ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు, ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్.విజయ్ మోహన్ అభినందించి ప్రతిష్ఠాత్మక టోర్నీలో పతకాలు సాధించి ఏయూ ప్రతిష్ఠ పెంచాలని ఆకాంక్షించారు.

# చిన్నారులకు విజయవంతంగా శస్త్రచికిత్సలు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైద్యులు

విశాఖపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు సంబంధించిన అత్యంత క్లిష్టమైన సమస్యలకు విజయవంతంగా శస్త్ర చికిత్సలు నిర్వహించామని రెయిన్ బో ఆస్పత్రి చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శాశ్వత మహంతి, డాక్టర్ యశ్వంత్ రెడ్డి, డాక్టర్ శ్రీలత పేర్కొన్నారు. జాతీయ పిల్లల శస్త్ర చికిత్స దినోత్సవం పురస్కరించుకుని ఆస్పత్రి ఆవరణలో శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టుకతో వచ్చిన అనేక లోపాలను సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలు నిర్వహించి తొలగించామన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 15 మంది పిల్లలకు ఇటువంటి క్లిష్టతరమైన శస్త్ర చికిత్సలు చేసినట్టు తెలిపారు. పుట్టుకతో వచ్చే లోపాలతో చిన్నారులు 10 నుంచి 20 శాతం మంది మృత్యువాత చెందుతారని, వీటికి సరైన సమయంలో శస్త్ర చికిత్స నిర్వహించడం వల్ల సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ తరహా సమస్యల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఏటా జాతీయ పిల్లల శస్త్ర చికిత్స దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 27 వారాలకే నెలలు నిండకుండా పుట్టిన 850 గ్రాములు బరువు కలిగిన శిశువుకు పేగులోని రంధ్రాలకు క్లిష్టమైన శస్త్ర చికిత్స నిర్వహించి కోలుకునేలా చేసినట్టు తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, నిపుణులైన వైద్య బృందంతో మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీశ్ రెడ్డి, డాక్టర్ అశ్వనీతోపాటు ఇతర వైద్యులు, శస్త్ర చికిత్స చేయించుకున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కూటమి జోరు... వైసీపీ బేజారు

... 5వ పేజీ తరువాయి

ఒక ఎంపీ, ఏడు అసెంబ్లీ స్థానాలు మాత్రమే ఉన్నాయి. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఘోర పరాజయం పొందారు. ఆయనపై అంతకు ముందు ఎన్నికల్లో ఓడిపోయిన శ్రీభరత్ తెలుగుదేశం పార్టీ తరపున మళ్లీ 2024 ఎన్నికల్లోను ఎంపీగా పోటీ చేశారు. నాటి మంత్రి బొత్స సత్యనారాయణ భార్య ఝాన్సీలక్ష్మిని వైసీపీ విశాఖ ఎంపీ అభ్యర్థిగా నిలిపింది. టీడీపీ అభ్యర్థి శ్రీభరత్ ఐదు లక్షలకు పైగా మెజారిటీతో గెలుపొందారు. విశాఖ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకజవర్గాల్లోను కూటమి అభ్యర్థులే గెలిచారు. తూర్పు నియోజకవర్గం నుంచి వెలగపూడి రామకృష్ణబాబు (టీడీపీ),పశ్చిమ నియో జకవర్గం నుంచి గణబాబు (టీడీపీ), ఉత్తర నియోజకవర్గం నుంచి విష్ణుకుమార్‌రాజు (బీజే పీ), దక్షిణ నియోజకవర్గం నుంచి వంశీకృష్ణ శ్రీనివాస్ (జనసేన), గాజువాకలో పల్లా శ్రీనివాసరావు (టీడీపీ), భీమిలిలో గంటా శ్రీనివాసరావు (టీడీపీ), పెందుర్తిలో పంచకర్ల రమేశ్‌బాబు (జనసేన) భారీ మెజారిటీతో గెలిచారు. రాజకీయాల్లోకి వచ్చిన తరువాత ఓటమి ఎరుగకుండా వరుసగా ఎంపీగా, ఎమ్మెల్యేగా గెలుచుకుంటూ వచ్చిన ముత్తంశెట్టి శ్రీనివాసరావు భీమిలిలో గంటా శ్రీనివాసరావు చేతిలో ఓడిపోయారు. మంత్రిగా ఉంటూ గాజువాక నుంచి పోటీ చేసిన గుడివాడ అమర్‌నాథ్ టీడీపీ అభ్యర్థి పల్లా చేతిలో చిత్తయిపోయారు. గతంలో అనకాపల్లి నుంచి టీడీపీ తరపున ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన ఆడారి ఆనందకుమార్ ఈసారి వైసీపీ తరపున విశాఖ పశ్చిమ నుంచి పోటీ చేసి అపజయం చెందారు.

### ఎన్నికల తరువాత

ఎన్నికలు ముగిసి ఆరు నెలలైంది. ఈమధ్య కాలంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారు. ఎమ్మెల్యే గణబాబుకు విప్‌గా అవకాశం ఇచ్చారు. ఇంకా కూటమి నాయకులు అనేక మందికి కార్పొరేషన్ పదవులు లభించాయి. జిల్లా పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా, దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్‌కు వీఎంఆర్‌డీఏ చైర్మన్ పదవి లభించింది. జనసేన నాయకుడు శివశంకర్‌కు చిన్న, మధ్య తరహా పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. విశాఖ డెయిరీపై తెలుగుదేశం నాయకులు విచారణ కోరడం, సభా సంఘం వేయడంతో ఉక్కిరిబిక్కిరి అయిన ఆడారి ఆనందకుమార్ టీడీపీలోకి రావాలని ప్రయత్నించారు. అవకాశం లభించకపోవడంతో బీజేపీ కండువా కప్పుకున్నారు. దీనికి రెండు వారాల ముందు భీమిలి మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వైసీపీకి గుడ్‌బై చెప్పేశారు. ఇదిలావుండగా వైసీపీ జిల్లా అధ్యక్షునిగా మాజీ మంత్రి గుడివాడ అమర్‌ను నియమించింది. అలాగే ఉమ్మడి జిల్లా సమన్వయకర్త బాధ్యతల నుంచి వైవీ సుబ్బారెడ్డిని తప్పించి మళ్లీ విజయసాయిరెడ్డికి అప్పగించింది. స్థానిక సంస్థల కోటా నుంచి బొత్స సత్యనారాయణ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

# పథకం ప్రకారమే గ్రీన్‌బెల్ట్ కొట్టేశారు

... 5వ పేజీ తరువాయి

ముందున్న గ్రీన్ బెల్ట్‌ను కలిపేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు సమర్పించిన ప్లాన్‌లోనే గ్రీన్ బెల్ట్‌ను ఏ విధంగా వాడుకుంటారనేది వివరించారు. 80 అడుగుల పొడవైన గ్రీన్ బెల్ట్‌లో 20 అడుగులు వాటర్ ఫౌంటెయిన్, 30 అడుగుల పొడవుతో ఒక డ్రైవ్ వే, ఇంకో 30 అడుగుల పొడవుతో మరో డ్రైవ్ వే ఏర్పాటుచేయనున్నట్టు ప్లాన్‌లో చూపించారు. జాతీయ రహదారి నుంచి షాపింగ్ మాల్‌కు మూడు మార్గాలు నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. అంటే వారి భూమికి ముందు ఎంత వెడల్పున గ్రీన్ బెల్ట్ ఉందో అంతా ఉపయోగించుకుంటామని ప్లాన్‌లో వివరించారు. ఆ గ్రీన్ బెల్ట్ భూమి జీవీఎంసీకి సంబంధించినది. వారి అనుమతి లేకుండానే, వారితో ఎటువంటి ఒప్పందం లేకుండానే దానిని ఉపయోగించుకుంటామని ప్లాన్ పెట్టారు. అలాగే గ్రీన్‌బెల్ట్ నుంచి దారి కోసం భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు దరఖాస్తు చేశారు. ప్లాన్‌లో మార్గాలు చూపించి, ఎన్‌హెచ్ఏఐకు నాలుగు మార్గాలు కావాలని కోరారు. దానికి వారు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం (ఎన్ఓసీ) మాత్రమే ఇచ్చారు. మాల్‌కు మార్గం ఏర్పాటు చేసుకోవడానికి తమకు అభ్యంతరం లేదని, కాకపోతే ఆ భూమి ఎవరిదో వారి నుంచి అనుమతి తీసుకోవాలని, ఆ గ్రీన్ బెల్ట్ తొలగింపునకు అటవీ శాఖ అనుమతి తీసుకోవాలని స్పష్టంచేశారు. ఈ విషయాన్ని ఈ నెల 23న విశాఖ ఎంపీ శ్రీభరత్ సమక్షంలో జరిగిన సమావేశంలో ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ప్రశ్నించినప్పుడు ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ స్పష్టంచేశారు. తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, కేవలం ఎన్ఓసీ ఇచ్చామని పేర్కొన్నారు. అంటే ఆ భూమి యజమాని అయిన జీవీఎంసీయే దానిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదే సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కూడా ఉన్నారు. కలెక్టర్ స్పందించి ఎంక్వైరీ వేయాలని విష్ణుకుమార్‌రాజు కోరారు. దానికి ఆయన అంగీకరించారు.

### ఆ భూమి విలువ రూ.60 కోట్లు

మెగా షాపింగ్‌మాల్ యాజమాన్యం ప్రభుత్వానికి చెందిన రూ.60 కోట్ల విలువైన భూమి (గ్రీన్ బెల్ట్)ని కలిపేసుకుంది. గ్రీన్ బెల్ట్ నుంచి నాలుగు దారులు ఏర్పాటు చేసుకుంటామని చెప్పి 3,964 చ.అడుగుల భూమిని సిమెంట్ కాంక్రీట్‌గా మార్చి డ్రైవ్ వేలు నిర్మించుకుంది. ఆ భూమి జీవీఎంసీకి చెందినది. వారు స్పందించడం లేదు. కూటమి నాయకుల ఫ్లెక్సీలు నిర్మాణం ముందు పెట్టారని తెలిసి వెళ్లి చూశాను. నా ఫొటో కూడా ఉంది. మొత్తం అందరివీ తీసేయాలని చెప్పి తొలగింపజేశాను. అయితే వారు మళ్లీ నా ఒక్క ఫొటో తప్ప ఇతర నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీలు పెట్టారు. వాటితో అధికారులను బెదిరిస్తున్నారు. 1,500 మందికి ఉపాధి కల్పిస్తే ప్రభుత్వ భూమిని కలిపేసుకుంటారా? దానిని అధికారులు ఆమోదిస్తారా?, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరగాలి.

- పి.విష్ణుకుమార్‌రాజు, ఉత్తర ఎమ్మెల్యే

# జైలు ఎదుట ఆందోళన

... 5వ పేజీ తరువాయి

సూపరింటెండెంట్ మహేష్‌బాబు దురుసుగా ప్రవర్తించడంతోపాటు అసభ్యపదజాలంతో దూషించారు. ఆ విషయాన్ని ఇద్దరూ తోటి వార్డర్లకు చెప్పడంతో అందరూ సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో బయటకు వచ్చి ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు దిగారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ విధి నిర్వహణ పేరుతో తమను వేధిస్తున్నారని, అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మిగిలిన అధికారులు వచ్చి వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించి జైలు ఆవరణలోని క్వార్టర్లకు వెళ్లిపోయారు. కొంతసేపటి తర్వాత సూపరింటెండెంట్ తనను ఎవరూ ఏమీ చేయలేరని వ్యాఖ్యానించినట్టు తెలుసుకుని వార్డర్లు తమ కుటుంబసభ్యులతో కలిసి వచ్చి మళ్లీ జైలు ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు దిగారు. వార్డర్లు పక్కన నిలబడితే వారి కుటుంబ సభ్యులు ఆందోళన కొనసాగించారు. రాత్రి పది గంటలకు కూడా ఆందోళన విరమించలేదు. జైళ్ల శాఖ ఉన్నతాధికారులు వచ్చే వరకు కదిలేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. దీనిపై ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మహేష్‌బాబు వివరణ ఇస్తూ ఒకరు విధుల్లోకి వచ్చినప్పుడు తరచూ గంజాయితో వస్తున్నారని, దీనిపై సమాచారం ఉండడంతోనే వారిద్దరినీ తనిఖీ చేశామన్నారు. జైలు నిబంధనలకు లోబడి, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే నడుచుకుంటున్నామన్నారు.

# శభాష్ నితీశ్

... 5వ పేజీ తరువాయి

వ్యక్తిగత స్కోరు 99 పరుగుల వద్ద బోలండ్ బౌలింగ్‌లో మిడాన్ మీదుగా బౌండరీ బాది టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీ సాధించాడు. నితీశ్‌కుమార్‌రెడ్డి సెంచరీ చేయడంతో స్టేడియంలో భారత్ క్రీడాభిమానుల గ్యాలరీ స్టాండ్ కేరింతలు, చప్పట్లతో దద్దరిల్లింది.

### సిరీస్‌లో అమోఘంగా రాణిస్తున్న నితీష్‌కుమార్ రెడ్డి

ఈ సిరీస్‌లో నితీశ్‌కుమార్‌రెడ్డి అమోఘంగా రాణిస్తున్నాడు. కెరీర్‌లో తొలి టెస్ట్ సిరీస్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో ప్రపంచ దిగ్గజ క్రికెటర్ల ప్రశంసలు అందుకుంటున్నాడు. పెర్త్‌లో జరిగిన తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 41, రెండో ఇన్నింగ్స్‌లో 38 (నాటౌట్) పరుగులో రాణించి జట్టు విజయంలో కీలక ప్రాత వహించాడు. ఆడిలైట్‌లో జరిగిన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 42 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 42 పరుగులు చేశాడు.

# సంక్రాంతికి 1000 బస్సులు

... 5వ పేజీ తరువాయి

మేనేజర్లు గుర్తించాలని సూచించారు. గరుడ, గరుడ ప్లస్, అమరావతి, నైట్ రైడర్, క్రూయిజ్, ఆల్ట్రా డీలక్స్ వంటి సర్వీసులను దూర ప్రాంతాలకు, ఆల్ట్రా డీలక్స్ సూపర్ లగ్జరీ, సూపర్ డీలక్స్, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ వంటి సర్వీసులను జోనల్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు నడిపేందుకు ఏర్పాట్లు చేయాలని డిపో మేనేజర్లకు ఆయన ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, డిపో మేనేజర్లు గంగాధర్ (విశాఖపట్నం), అరుణకుమారి (మద్దిలపాలెం), ప్రవీణ (గాజువాక), రాజశేఖర్ (సింహాచలం), అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు పాల్గొన్నారు.

## ఉత్తర నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా వీధి దీపాల నిర్వహణ

మురళీనగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో వెలుగులే లేని రోడ్డు మార్గాల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ఏరియాల్లో రోజంతా వెలుగుతున్న దీపాలతో విద్యుత్ వృథా అవుతోంది. మాధవధార 51వ వార్డు ఉడాకాలనీలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఉడాకాలనీ కొండ చివర నివాసాలు లేని చోట కూడా విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. మరో వైపు ఆర్టీఏ కార్యాలయం రోడ్డు, అంబేడ్కర్ కాలనీల్లో చీకట్లు అలముకున్నాయి. అలాగే 50వవార్డు మాధవధార బృందావన్ పార్కు, సాయిరాం కాలనీ కొండప్రాంతాలు చేరే దారుల్లో వెలుగులు లేవు. ఈ సమస్యను తొలగించే విధంగా జీవీఎంసీ అధికారులు విద్యుత్ దీపాల నిర్వహణ విభాగం అధికారులు, స్థానిక సచివాలయ సిబ్బంది ప్రజల ఇబ్బందులపై దృష్టి సారించాలని నివాసిత కాలనీల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## క్రికెట్ పోటీల లోగో ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌పీవీ హార్ట్‌ఫుల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న బీహెచ్‌పీవీ మాజీ ఉద్యోగుల కుమారుల క్రికెట్ టోర్నమెంట్ లోగోను సినీ నటుడు ప్రసన్నకుమార్ శనివారం ఆవిష్కరించారు. భెల్ హెచ్‌పీవీపీ యూనియన్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ప్రసన్నకుమార్ మాట్లాడుతూ బీహెచ్‌పీవీ మాజీ, ప్రస్తుత ఉద్యోగుల కుమారులతో క్రికెట్ పోటీలు నిర్వహించడం వల్ల వారి మధ్య మరింత స్నేహ బంధం పెరుగుతుందన్నారు. నిర్వాహకులు జె.రాము మాట్లాడుతూ జనవరి పది నుంచి భెల్ క్రీడా మైదానంలో మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో ఎనిమిది జట్లు పాల్గొంటాయన్నారు. కార్యక్రమంలో కొరియాగ్రాఫర్ రమేశ్, యూనియన్ నాయకులు ఎస్.సాహు, పీవీఎన్ రాజు, బి.బాబూరావు, గవర వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యుత్ చార్జీలపై ప్రశ్నించే హక్కు వైసీపీకి లేదు'

గాజువాక, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అదానీతో కుమ్మక్కై రాష్ట్ర ప్రజల హక్కులను తాకట్టు పెట్టిన వైసీపీ నాయకులకు విద్యుత్ చార్జీల పెంపుపై మాట్లాడే నైతిక హక్కు లేదని టీడీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నాడు చేసిన తప్పుడు ఒప్పందాల వల్ల సుమారు రూ.30 వేల కోట్ల భారం ప్రజలపై పడిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పాపాలు నేడు రాష్ట్ర ప్రజలకు శాపాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు తమరి శివప్రసాద్, డి.సత్యారావు, కూన వెంకటరావు, శివ, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి చర్యలు

అగనంపూడి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. వార్డు పరిధిలోని శనివాడ, పరిసర ప్రాంతాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కరణం సత్యారావు, ఎం.వెంకటరావు, ఎస్.సింహాచలం, నాగేశ్వరరావు, రుద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## టీకాలపై స్పెషల్ డ్రైవ్

గాజువాక, డిసెంబరు 28: గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం గాజువాక ప్రాంతంలో పిల్లల వ్యాధి నిరోధక టీకాల వినియోగంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. టీకాల ఆవశ్యకతను పిల్లల తల్లులకు వివరించారు. వ్యాధి నిరోధక టీకాలు వేసుకోని ఏడాదిన్నర పిల్లలకు టీకాలు వేశారు. టీకాలు వేసుకోలేని పిల్లలను గుర్తించి ఆయా ప్రాంతాల్లోని ఇళ్ల వద్దకు వైద్య సిబ్బంది వెళ్లి టీకాలు వేశారు. గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ పర్యవేక్షణలో చేపట్టిన కార్యక్రమంలో ఆరోగ్య అధికారి పి. నాగప్పారావు, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## సినిమా గైడ్

- **బచ్చలమల్లి:** సంగం, రమాదేవి, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **విడుదల-2:** శ్రీకన్య, వెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీమోహిని(గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **యుఐ:** శారద, శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక)
- **ముఫాసా:** జగదాంబ, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **పుష్ప-2:** మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 20, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 34, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 40, బీరకాయలు 52, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 14, క్యాబేజీ 20, క్యారెట్ 40, దొండకాయలు 50, బంగాళదుంపలు 26, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 50, బరబాటి 42, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 30 దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 270, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 50, పొటల్స్ 60, కీరదోస 30, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 36, కంద 60, దేముడుచిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, మామిడి అల్లం 64, కర్రపెండలం 28, బొప్పాయి 40, బూడిద గుమ్మడికాయ 30, జామకాయలు (కిలో) 45.

| కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో) | |
|---|---|
| విశాఖపట్నం | 600 |
| విజయనగరం | 604 |
| శ్రీకాకుళం | 604 |

| చికెన్ ధరలు (బ్యాగ్) | |
|---|---|
| రైతు ధర | 102 |
| ఫారం ధర | 122 |
| విత్ స్కిన్ | 214 |
| స్కిన్‌లెస్ | 224 |



పనులు పూర్తయిన గాజువాక వందడుగుల రోడ్డు



గాజువాకలోని కణితి రోడ్డు

# గోతులమయమైన రోడ్లకు మోక్షం

- గాజువాక నియోజకవర్గంలో 70 శాతం రహదారుల అభివృద్ధి పనులు పూర్తి
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కొత్తపాలెం-నరవ ప్రధాన రోడ్డు పనుల్లో నిమగ్నమైన కార్మికులు

గాజువాక, డిసెంబరు 28: గాజువాక నియోజకవర్గంలోని గుంతల రోడ్లకు ఎట్టకేలకు మోక్షం లభిస్తుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఈ క్రమంలో నియోజకవర్గంలో గోతులమయమైన రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. తొలి విడతగా పట్టణ పరిధిలో ఉన్న ప్రధాన రహదారుల అభివృద్ధి పనులను ప్రారంభించగా, ప్రస్తుతానికి ఇవి తుది దశకు చేరాయి. దీంతో వాహనదారుల కష్టాలు తీరుతాయని చెప్పవచ్చు. నియోజకవర్గంలో గోతులతో నిండిన రోడ్లకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో ప్రజలు ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు నానాపాట్లు పడ్డారు. ప్రస్తుతం గాజువాక పట్టణ పరిధిలోని కణితి రోడ్డు, వందడుగుల రహదారి, వుడా రోడ్డు, గాజువాక ప్రధాన రహదారి, 60 అడుగుల రోడ్డు, తదితర ప్రధాన రహదారుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు సుమారు 70 శాతం రహదారుల పనులు పూర్తవ్వగా, మిగిలిన 30 శాతం పనులు కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు. మిగిలిన రోడ్లకు కూడా టెండర్లు పిలవడం జరిగిందని, ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఏదిఏమైనా గోతులతో నిండిన రహదారుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తుండడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### 89వ వార్డులో చురుగ్గా రహదారి నిర్మాణం

**గోపాలపట్నం:** వరదనీటి ముంపు కారణంగా దుర్భరంగా మారిన రహదారి నిర్మాణం చురుగ్గా సాగుతోంది. 89వ వార్డు కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే ప్రధాన రహదారిలో కొత్తపాలెం శివారు వద్ద వరద ముంపు కారణంగా తరచూ రహదారి కోతకు గురవుతుంది. గుంతలుగా మారిన రహదారిపై రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే రాకపోకలు నిలిచిపోయి అవస్థలు పడేవారు. ఈ క్రమంలో పత్రికల్లో వచ్చిన కథనాలకు అధికారులు, నేతలు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. రహదారి కోతకు గురికాకుండా ఇరువైపులా రక్షణ గోడ నిర్మిస్తున్నారు.

## సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలి

**జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్**

విశాఖపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో నిర్వహించనున్న సైన్స్ ఫెయిర్ 2024-25ను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు . శనివారం తోటగరువు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్ ఏర్పాట్ల గురించి వివరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 8 నుంచి పదో తరగతి విద్యార్థులకు సైన్స్ ఫెయిర్‌కు హాజరయ్యేలా చూడాలన్నారు. ఇవి మూడు దశల్లో ఉంటాయన్నారు. డిసెంబరు 30న పాఠశాల స్థాయి, 31న మండల స్థాయి, జనవరి 3న జిల్లా స్థాయిలో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, స్పేస్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఇంజనీరింగ్, బయో కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ అంశాలకు సైన్స్ ఫెయిర్‌లో స్థానం ఉంటుందన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, ఏడీ-1 అరుణజ్యోతి, చినగదిలి ఎంఈవో సీహెచ్ రవీంద్రబాబు, డీసీబీ బోర్డు కార్యదర్శి కృష్ణకుమార్, జిల్లా సైన్స్ అఫీసర్ ప్రసాద్, పీఈవో సునీత, తోటగరువు హైస్కూలు హెచ్‌ఎం దుర్గాభవానీ తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

మల్కాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక తులసీ ఆనందరావు (39) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం త్రినాథపురంలో చోటుచేసుకుంది. మల్కాపురం పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రాంతంలో తులసీ ఆనందరావు పనులు చేస్తూ కుటుంబ పోషణ చేసుకునేవాడు. అయితే అప్పులు పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆనందరావు 15 రోజుల క్రితం భీమవరం నుంచి త్రినాథ్‌పురం వచ్చి భార్య తులసీ వెంకట భారతిదేవితో చెప్పి బాధపడ్డాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పడకగదిలో బెడ్‌షీట్‌తో ఫ్యాన్ హుక్‌కు ఉరేసుకుని మృతిచెందాడు. భార్య తులసీ వెంకట భారతి మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఉక్కునగరంలో సీపీఐ శత వార్షికోత్సవం

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణతో పాటు కార్మిక హక్కుల కోసం పోరాడేది ఒక్క సీపీఐ మాత్రమేనని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ అన్నారు. ఉక్కునగరంలో శనివారం నిర్వహించిన సీపీఐ శత వార్షికోత్సవాలను పురస్కరించుకుని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వందేళ్లుగా దేశంలో చేపట్టిన ప్రజా పోరాటాలలో సీపీఐ అగ్రగామిగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, జె.రామకృష్ణ, కె.రాజబాబు, జి.ఆనంద్, జి.బోసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు | ఎస్‌డీసీ మధుసూదనరావు



86వ వార్డులో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీవల్లి. చిత్రంలో ఎస్‌డీసీ మధుసూదనరావు, తదితరులు ఉన్నారు

కూర్మన్నపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తోందని, వీటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌డీసీ మధుసూదనరావు కోరారు. 86వ వార్డు పరిధి పకీరుతక్యాలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని ఏపీఐఐసీ బాధితుల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూస్తానన్నారు. కూటమి ప్రభుత్వం భూ బాధితులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. గాజువాక తహసీల్దార్ తోట శ్రీవల్లి మాట్లాడుతూ ఈ సదస్సులో ఏడులను స్వీకరించామని, ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఆక్రమణలకు గురైన స్థలాలు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై విచారణ జరిపి ప్రజలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎస్‌డీసీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నల్లూరు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాదుల శ్రీనివాసరావు, వేగుంట శ్రీనివాస్,మోసా, అయూబ్, తదితరులు పాల్గొన్నారు.

**మల్కాపురం:** రెవెన్యూ సదస్సుల ద్వారా భూముల సమస్యలు పరిష్కరించుకోవాలని ములగాడ తహసీల్దార్ భుజంగరావు సూచించారు. ములగాడ కూడలిలోని గోకులకృష్ణ యాదవ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రీ-సర్వేలో లోపాలు, పేర్లు తప్పులు సరిదిద్దడం, అడంగళ్ సమస్యల పరిష్కారానికి సదస్సులు ఉపయోగపడతాయన్నారు. సదస్సులో 36 మంది అర్జీలు సమర్పించారు. ములగాడలో ఓ సంస్థ యాజమాన్యం శ్మశాన స్థలం కబ్జాకు ప్రయత్నిస్తోందని ఎంఆర్‌పీఎస్ నాయకుడు కింతాడ రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవో-296 ప్రకారం స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని కోరుతూ ఆ పార్టీ 59వ వార్డు అధ్యక్షుడు రేవల సత్యనారాయణ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ రమ, ఆర్‌ఐ దివ్య, సర్వేయర్ ముద్దుకృష్ణకుమార్, ఆర్థికాభివృద్ధి సంస్థ డైరెక్టర్ అంగ దుర్గాప్రశాంతి,వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సీహెచ్ రామ్మోహన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### పలు సమస్యలపై చీమలాపల్లి గ్రామస్థుల వినతి

**పెందుర్తి-రూరల్:** తమకు, తమ గ్రామానికి ప్రతిబంధకంగా మారిన మర్రి చెరువు సమస్య నుంచి విముక్తి కల్పించాలని గ్రేటర్ 95వ వార్డు పరిధి చీమలాపల్లి గ్రామస్థులు రెవెన్యూ అధికారులను కోరారు. స్థానిక సచివాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అయితా ఎర్రయ్య, స్థానిక నాయకులు అయితా ఎర్నిబాబు, చిప్పల చందు, దువ్వి అప్పారావులతో పాటు పలువురు గ్రామస్థులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామారావుకు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో పేదలకు గృహ వసతి కల్పన నిమిత్తం ప్రభుత్వ ఆదేశాల మేరకు 91లో వుడా లేఅవుట్ రూపకల్పన చేస్తే రెవెన్యూ అధికారులు నివేశన పట్టాలు మంజూరు చేశారని, వీటి ఆధారంగా గృహనిర్మాణ శాఖ రుణాలు మంజూరు చేసిందన్నారు. ఈ లేఅవుట్‌లో ఏ పని కోసం వెళ్లినా అధికారులు కొర్రీ వేస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే స్థానిక కొండ ప్రాంతంలో కురిసే వాన నీటి ప్రవాహానికి ఏర్పడిన అడ్డంకులను తొలగించాలని, శ్మశానవాటిక స్థలంలో సర్వే చేసి సరిహద్దులు పోల్చి అప్పగించడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నారు.



# ఉత్తమ పోలీసింగ్‌కు అన్ని శాఖల సహకారం అవసరం: సీపీ శంఖబ్రత బాగ్చి



సమావేశంలో మాట్లాడుతున్న శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు ఉత్తమ పోలీసింగ్ సేవలను అందించడానికి అన్ని ప్రభుత్వ శాఖల సహకారం అవసరమని సీపీ శంఖబ్రత బాగ్చి అభిప్రాయపడ్డారు. సిరిపురం కూడలిలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వార్షిక నేర సమీక్ష సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పోలీసులు నిర్వర్తించే అనేక రకాల విధుల్లో న్యాయశాఖ, నేవీ, అగ్నిమాపక, జైళ్ల శాఖల సహకారం అవసరం ఉంటుందన్నారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్‌తో పాటు నేవీ, అగ్నిమాపక, జైళ్ల శాఖల అధికారుల సమక్షంలో ఒక్కో పోలీస్ స్టేషన్ వారీగా నమోదైన కేసులు, పరిష్కరించినవి, కోర్టులో పెండింగ్ ఉన్న కేసులు, శిక్ష పడిన కేసుల వివరాలను ఆయా స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



శ్రీవారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

# కమనీయం వేంకటేశ్వరస్వామి కల్యాణం

**పలు ఆలయాల్లో వైభవంగా ధనుర్మాసోత్సవాలు**

పెందుర్తిరూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని చింతల అగ్రహారం బస్టాండ్ కూడలిలో శనివారం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాళ్ల సురేశ్ ఆధ్వర్యంలో పెందుర్తి వెంకటాద్రి ఆలయ ప్రధాన అర్చకులు మహార్తి రామానుజాచార్యులు నేతృత్వంలో వేద పండితులు కల్యాణోత్సవాన్ని జరిపారు. నగరంలో పలువురు ప్రముఖులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

**పెదగంట్యాడ:** జీవీఎంసీ 65వ వార్డు పరిధి వెంకటాద్రిపై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరాలయంలో స్వామివారిని, గోదాదేవికి తులసీదళాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలను చేపట్టారు. 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు ఎం.అప్పలరెడ్డి, టి.వెంకటేశ్, జి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు.

**వేపగుంట:** నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వేంకటేశ్వరాలయంలో గోదాదేవికి సామూహిక కుంకుమ పూజలు, స్వర్ణ పుష్పార్చనలు జరిపారు. తిరుప్పావై పారాయణం, 13వ పాశురం విశిష్టతను అర్చకుడు శ్రీనివాస స్వామి భక్తులకు వివరించారు.

**ఎన్.ఎ.డి.జంక్షన్:** జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో వైకుంఠ వేంకటేశ్వరాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

**పెందుర్తి:** వెంకటాద్రి శిఖరంపై కొలువుదీరిన శ్రీవారిని పవిత్ర జలాలతో అభిషేకించాక వజ్రకవచధారిగా అలంకరించి విశేష హారతులిచ్చారు. గోదాదేవి అమ్మవారికి విశేష కుంకుమార్చన చేశాక తిరుప్పావై పఠించారు. గోదాదేవి పన్నెండో పాశురాన్ని స్వామికి నివేదించారు. ఆరు ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు

**మల్కాపురం:** మల్కాపురం వీధుల్లో వేకువజామున శ్రీవారిని పల్లకీలో ఊరేగించారు. ఈ సందర్భంగా పలువురు హారతులిచ్చారు. భక్తులు స్వామివారి గీతాలాపన చేస్తూ పల్లకీ సేవలో పాల్గొన్నారు. ధనుర్మాసం ముగిసేంత వరకు వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. .

## ద్రోణంరాజు సత్యనారాయణకు నివాళి

మల్కాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ద్రోణంరాజు సత్యనారాయణ వర్ధంతిని 59వ వార్డులో ఆయన అభిమాని మూగి సూర్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంగన్‌వాడీ పిల్లలకు రొట్టెలు, బిస్కెట్లను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు డి.నూకరాజు, శ్రీకృష్ణ యాదవ యువజన సేవా సంఘం అధ్యక్షుడు బంగారురాజు, తదితరులు పాల్గొన్నారు.

# ఈఐఎల్ నికర లాభం రూ.2.1 లక్షలు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉక్కు మంత్రిత్వ శాఖ నియంత్రణలో ఉన్న స్టీల్‌ప్లాంట్ అనుబంధ సంస్థ అయిన ఈస్టర్న్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ (ఈఐఎల్) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.1 లక్షల నికర లాభాన్ని ఆర్జించినట్టు సంస్థ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఏకే సక్సేనా తెలిపారు. ఉక్కు పరిపాలన విభాగంలో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ఈఐఎల్ నికర విలువ రూ.267.17 కోట్లు ఉందన్నారు. ఒడిశా మినరల్ డెవలప్‌మెంట్ సంస్థకు 2022-23 సంవత్సరానికి గాను రూ.26.54 కోట్ల నష్టం రాగా, 2023-24లో రూ.2.82 కోట్ల నికర లాభం ఆర్జించిందన్నారు. మరో అనుబంధ సంస్థ అయిన బీఎస్ఎల్‌సీకి 2023-24లో రూ.2.29 కోట్ల నికర లాభం వచ్చినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు స్వప్న భట్టాచార్య, ఎస్‌సీ పాండే, ఎస్.రాజబాబు కె.హేమరాజు, తదతరులు పాల్గొన్నారు.

# వైసీపీవి సిగ్గులేని ఆందోళనలు

**ఏడు వార్డుల కూటమి కన్వీనర్ విశ్వనాథుల దినకర్**

మల్కాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ సిగ్గులేకుండా ఆందోళనలు చేస్తుందని, ఆ ప్రభుత్వం వలనే ఇప్పుడు చార్జీలు పెరిగాయని ఏడు వార్డుల టీడీపీ, జనసేన, బీజేపీ కన్వీనర్ విశ్వనాథుల దినకర్ పేర్కొన్నారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అవినీతి సొమ్ము కోసం తప్పుడు పనులు చేసి ప్రజలను మోసగించారని అన్నారు. వైసీపీ ఆందోళనలకు తగిన రీతిలో బుద్ధిచెప్పాలని కూటమి నాయకులను కోరారు. విద్యుత్ చార్జీలకు సంబంధించి నిజానిజాలు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. వైసీపీ పాలనలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి, ఇప్పుడు ప్రజలకు ఏదో మేలు చేసినట్టు మోసపూరిత ఆందోళనలు చేస్తున్నారని అన్నారు.

# కార్మిక చట్టాలను అమలు చేయాలి

**ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్ట్ వర్కర్స్ లేబర్ యూనియన్ నేత అప్పలరాజు**

సింధియా, డిసెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చట్టాలు అమలు చేయడం ద్వారానే కార్మికులకు న్యాయం జరుగుతుందని విశాఖ ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్ట్ వర్కర్స్ లేబర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దేవర అప్పలరాజు పేర్కొన్నారు. శనివారం ఐటీసీ జంక్షన్ వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్మికుడు కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.గిరీశ్, ఎ.వెంకటేశ్, ముసలి నాయుడు, త్రినాథ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

# ములగాడలో ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

మల్కాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ములగాడలో సర్వే నంబర్ 21/5లో ఉన్న దాదాపు 25 సెంట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు పలువురు స్కెచ్ వేశారు. ఇటీవలే మండల తహసీల్దార్ సిబ్బంది దీన్ని గుర్తించారు. ఇంతకాలం జిరాయితీ భూమిగా భావించి అధికారులు పట్టించుకోలేదు. ఇది ప్రభుత్వ భూమి అని, దీనిని కబ్జా చేసేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని తహసీల్దార్‌కు కొంతమంది సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ సూచన మేరకు సర్వేయర్ క్షేత్రస్థాయిలోనూ, రికార్డులు పరిశీలించగా, అది భూమి ప్రభుత్వ భూమి అని తేలింది. ఈ నేపథ్యంలో ఏపీఐఐసీ భూములు సహా ములగాడలోని అన్ని ప్రభుత్వ భూముల వద్ద బోర్డులు పెట్టడానికి సిబ్బంది సమాయత్తమవుతున్నారు.

# అబ్బురపరిచిన నేవీన్యాసాలు


విశాఖ సాగర తీరంలో శనివారం సాయంత్రం నిర్వహించిన నేవీ విన్యాసాలు ఆద్యంతం అదరహో అనిపించేలా సాగాయి. నీలాకాశం నుంచి మెరైన్ కమెండోలు పారాచూట్లతో కిందకు దిగడం, నడిసంద్రంలోని యుద్ధ నౌకపై హెలికాప్టర్ ల్యాండింగ్ కావడం, శత్రుమూకలపై నావికాదళాలు దాడికి పాల్పడడం, సముద్రంలో మునిగిపోతున్న వారిని హెలికాప్టర్ సాయంతో రక్షించడం వంటి విన్యాసాలు అబ్బురపరిచాయి.


జెమినీ బోట్లతో తీరానికి దూసుకువస్తున్న కమెండోలు


పారాచూట్ సాయంతో కిందకు దిగుతున్న మెరైన్ కమెండర్


శత్రువుల బారినుంచి సైనికులను విడిపిస్తున్న కమెండోలు


దాడి అనంతరం శత్రు శిబిరం నుంచి తరలివెళుతూ..


హెలికాప్టర్ నుంచి దిగుతున్న కమాండోలు


యుద్ధ నౌకపై దిగుతున్న హెలికాప్టర్


విన్యాసాలను మొబైల్‌లో చిత్రీకరిస్తున్న మహిళ


కంటిన్యుటీ ఫైర్ డ్రిల్..



వాటర్ బాంబ్..


డార్నియర్ యుద్ధ విమానం


విన్యాసాలను తిలకిస్తున్న నేవీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు


చేతక్ హెలికాప్టర్ల విన్యాసాలు


రిహార్సల్స్‌ను వీక్షిస్తూ..


జాతీయ పతాకంతో చేతక్ హెలికాప్టర్ల ప్రదర్శన


సబ్‌మెరైన్ ప్రదర్శన

# మేయర్ తక్షణమే రాజీనామా చేయాలి

» కూటమి కార్పొరేటర్ల డిమాండ్


విలేకరుల సమావేశంలో పాల్గొన్న గంధం శ్రీనివాసరావు, మూర్తి యాదవ్, తదితరులు

విశాఖపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కౌన్సిల్ అధికారాలు, నియమ నిబంధనల పట్ల అవగాహన లేని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కూటమి కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. జీవీఎంసీలోని టీడీపీ ఫ్లోర్ లీడర్ కార్యాలయంలో ఆ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముడసర్లోవలో రూ.ఆరు కోట్ల వ్యయంతో గుర్రపు స్వారీ ప్రాజెక్టుకు మేయర్ ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌కు రూ.మూడు కోట్ల బిల్లు చెల్లించడంపై ఈ నెల 11న జరిగిన కౌన్సిల్‌లో చర్చ జరిగిందన్నారు. ఈ సందర్భంగా మేయర్ అది గుర్రపు స్వారీ ప్రాజెక్టు అని తనకు తెలియదని, ఏవో విగ్రహాలు, బొమ్మలు పెడతారనే భావనతో ముందస్తు అనుమతి ఇచ్చానని చెప్పడం ఆమె అవివేకాన్ని తెలియజేస్తోందన్నారు. సదరు కాంట్రాక్టర్‌కు రూ.3 కోట్ల బిల్లు చెల్లించినా ఆ విషయాలేవీ తనకు తెలియవని ఆమె కౌన్సిల్‌లో చెప్పడం ద్వారా మేయర్ పదవిని దిగజార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే నైట్ ఫుడ్ కోర్టులో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని, నలుగురు షాడో మేయర్లు జీవీఎంసీని గుప్పెట్లో పెట్టుకుని అవినీతికి పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. దీనిపై తక్షణమే కమిటీ వేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, టీడీపీ నాయకుడు గొలగాని పోలారావు పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో శిశువు మృతిపై విచారణ


శిశువు మృతిపై విచారణ జరుపుతున్న వైద్యులు

జగదాంబ కూడలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో శిశువు మృతి ఘటనపై విచారణకు ఘోషాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషాప్రసాద్ ఆదేశించారు. శనివారం కేజీహెచ్ పిల్లల విభాగం ప్రొఫెసరు డాక్టర్ ఎం.చౌదరిబాబు, విక్టోరియా గైనిక్ డాక్టర్ పి.శైలజల నేతృత్వంలో విచారణ చేపట్టారు. స్పెషల్ కేర్ న్యూబోర్న్ కేర్ యూనిట్‌లో శిశువుకు సేవలందిస్తున్న వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని విచారించినట్లు తెలిసింది. శిశువు మృతికి కారణాలను పిల్లల వైద్యుడు సమగ్రంగా విచారించి నివేదిక ఇవ్వనున్నారు.

# దేహదారుఢ్య పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

» అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

విశాలాక్షినగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి ఈనెల 30 నుంచి కైలాసగిరి దిగువన ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వు మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్టు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. శనివారం ఆయన పరీక్షల నిర్వహణలో పాల్గొనే పోలీసు సిబ్బందితో ఆర్మ్‌డ్ రిజర్వు మైదానంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేహదారుఢ్య పరీక్షలకు 11, 568 మంది అభ్యర్థులు హాజరుకానుండగా, అందులో పురుషులు 9414, మహిళా అభ్యర్థులు 2154 మంది ఉన్నారని తెలిపారు. ఏపీఎస్ఎల్ఆర్‌బీ ఆదేశాలు, నిబంధనల మేరకు పరీక్షలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఫిజికల్ మెజర్మెంట్, ఏఫిషియన్సీ పరీక్షలు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరగాలని, అభ్యర్థుల ప్రవేశమార్గం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన, బయోమెట్రిక్ బ్యాగేజ్ కౌంటర్, దేహదారుఢ్య పరీక్షలు జరిగే ప్రదేశాల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే టాయిలెట్లు, తాగునీటి సదుపాయం, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎల్. మోహనరావు, ఎస్బీ డీఎస్పీ బి. అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సుజాతనగర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

హైదరాబాద్ వాసిగా గుర్తింపు


మృతుడు శ్రీకాంత్ (ఫైల్)

పెందుర్తి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్‌లో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనంలో హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సుజాతనగర్‌లో అపార్ట్‌మెంట్‌లో కొన్ని ఫ్లాట్ల పనులు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం వాచ్‌మన్ అన్ని ఫ్లాట్లను పరిశీలించాడు. ఐదో అంతస్తులో తలుపులు బిగించని ఓ ఫ్లాట్ బాత్‌రూమ్‌లో గల షవర్‌కు తాడుతో ఉరేసుకుని ఉన్న యువకుడి మృతదేహం కనిపించింది. దీంతో వాచ్‌మన్ ఆందోళన చెంది పెందుర్తి పోలీసులకు సమాచారమిచ్చాడు. సీఐ సతీశ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. యువకుడి మృతిపై అనుమానాలు వ్యక్తంకావడంతో మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బాత్‌రూమ్‌లో గల షవర్‌కు నైలాన్ తాడు కట్టి మెడకు బిగించుకుని, రెండు మోకాళ్లు కిందికి వేలాడుతూ ఉన్న స్థితిలో మృతదేహం కనిపించింది చేతి మణికట్టు కోసుకున్నట్లు గాయం ఉంది. సమీపంలో ఆధారాల కోసం వెదకగా బ్యాగు కనిపించింది. అందులో ఆధార్, పాన్ కార్డు తాడు, కత్తెర, సెల్‌ఫోన్ పోలీసులకు లభ్యమయ్యాయి. ఆధార్ కార్డులో ఉన్న వివరాల ఆధారంగా మృతుడు పి.వి. శ్రీకాంత్, వయస్సు 27 సంవత్సరాలు, హైదరాబాద్ అని ఉంది. ఇతను ఓ ప్రముఖ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అని ఐడీ కార్డు ద్వారా తెలిసింది. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలు మృతుడివేనా? అన్న నిర్ధారణ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు.మృతదేహం పడి ఉన్న తీరును బట్టి ఆత్మహత్యగా పోలీసులు భావిస్తున్నారు. తాను చనిపోతున్నట్లు రెండు రోజుల కిందటే కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేశాడని పోలీసులు అంటున్నారు. హైదరాబాద్ నుంచి సుజాతనగర్‌కు వచ్చి ఆత్మహత్య చేసుకోవడానికి కారణలు తెలియాల్సి ఉంది. క్లూస్ టీం, జాగిలాన్ని రప్పించి పోలీసులు మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నారు. ప్రాధమికంగా ఆత్మహత్యగా భావిస్తున్నామని ఇందులో వేరే కోణం ఏదైనా ఉందా? అన్నది దర్యాప్తులో తెలుస్తుందని సీఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

# పోలీసులకు చిక్కిన గొలుసు దొంగ

పెందుర్తి,డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై రివ్వున దూసుకు వచ్చి మహిళల మెడలోని బంగారు గొలుసులు తస్కరించి రెప్పపాటు కాలంలో మాయమయ్యే ఘరానా దొంగ పోలీసులకు చిక్కాడు. నిందితుడి నుంచి 2 తులాల బంగారం, డియో స్కూటర్ మొత్తం రూ.2 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. శనివారం క్రైమ్ ఎస్ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కంచరపాలెం బర్మా క్యాంపు కాలనీకి చెందిన గురుగుబిల్లి పవన్‌కుమార్(20) అలియాస్ గ్యాంగ్ కంచరపాలెంలో డియో స్కూటీని చోరీ చేశాడు. అంతటితో ఆగకుండా అటువైపుగా ద్విచక్ర వాహనంపై వస్తూ వెనుకన కూర్చుని ఉన్న వేపగుంట సమీపంలోని అప్పన్నపాలేనికి చెందిన వెంకటలక్ష్మి చేతితో పట్టుకుని ఉన్న వ్యానిటీబ్యాగ్ లాక్కున్నాడు. అందులో రెండు తులాల బంగారు మంగళసూత్రం ఉందని ఆమె శుక్రవారం పెందుర్తి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్ఐ సూరిబాబు దర్యాప్తు చేశారు. చోరీ జరిగిన ప్రాంతంలో సీసీ కెమేరాను పరిశీలించి ఇలాంటి గొలుసు దొంగతనాల్లో ఆరితేరిన గ్యాంగ్‌పై నిఘా పెట్టారు. దీంతో పవన్ పోలీసులకు దొరికాడు. నేర విభాగ పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేపట్టి తక్కువ సమయంలో దొంగను చోరీ సొత్తుతో పట్టుకోగలిగామన్నారు. గొలుసు దొంగను అరెస్టు చేసిన ఎస్ఐ సూరిబాబు, హెచ్‌సీలు నాగరాజు, ఎంఎస్ నాయుడు శ్రీరామ్, భవాని, శివప్రసాద్, దేవుడు నాయుడు, ఎల్ఎస్ నాయుడు, విజయ్, లెంక తాతారావు, పైడిరాజులను ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావులు అభినందించారు.

# 107 మంది పోలీసు సిబ్బందికి రివార్డులు

మహారాణిపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బంది సేవలను ప్రోత్సహిస్తూ 107 మందికి రివార్డులు అందజేశారు. శనివారం పోలీసు కమిషనరేట్‌లో కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో నగర పోలీసు శాఖలోని హోం గార్డు నుంచి సీఐ స్థాయి అధికారుల వరకు వారు నిర్వహిస్తున్న విధులకు గుర్తింపునిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన 107 మందికి రివార్డు మంజూరు ఉత్తర్వులు అందజేశారు.

## వైద్య సిబ్బంది ముఖ హాజరు తప్పనిసరి

» డీఎంహెచ్ఓ ఆదేశం

అక్కయ్యపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ నగర్, కణితిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు శనివారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి ఓపీ, ఐపీ, ఈహెచ్ఆర్, ఈ ఔషధి, ఎన్‌సీడీ 3.0 సర్వే నివేదికలను పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది హాజరును గమనించి పలు సూచనలు చేశారు. ముఖ హాజరు విధిగా వేయాలని, సమయపాలన పాటించాలన్నారు. ఈహెచ్ఆర్, ప్రసవాలపై పీహెచ్ఎన్, వైద్యాధికారి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలన్నారు. ఆర్‌బీఎస్‌కే స్కూల్ విజిట్స్, ఏడబ్ల్యూసీ స్క్రీనింగ్‌ను సమీక్షించి అభ ఐడీ మ్యాపింగ్ శతశాతం సాధించాలని వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట డాక్టర్ బి.ఉమాపతి, డీపీఎం బి.నాగేశ్వరరావు, డెమో, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు ఉన్నారు.

## గ్యాస్ లీకై మంటల్లో గాయాల పాలైన ఇద్దరి పరిస్థితి విషమం

ఆరిలోవ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పాత డెయిరీ ఫారం సమీపంలో గల ఇందిరానగర్‌లో ఈ నెల 25న ఓ ఇంట్లో వంట గ్యాస్ లీక్ మంటలు వ్యాపించి గాయపడిన ఐదుగురిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను విమ్స్‌కు తరలించారు. అయితే వారిలో చంద్రశేఖర్ (13), టి.రాజశేఖర్ (10)లకు ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శుక్రవారం రాత్రి వెంకోజీపాలెంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గాయపడిన మరో ముగ్గురు కోలుకుంటున్నట్టు తెలిసింది.

## స్టేషన్లలో రైల్వే జీఎం తనిఖీలు

విశాఖపట్నం,డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శనివారం విశాఖ,దువ్వాడ రైల్వేస్టేషన్లలో తనిఖీలు చేపట్టారు. ముందుగా విశాఖ రైల్వేస్టేషన్‌ను సందర్శించి ప్రయాణికుల మౌలిక సదుపాయాల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం డీఆర్ఎం కార్యాలయంలో డివిజనల్ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. జ్ఞానాపురం మార్గం వైపు స్టేషన్ పునరుద్ధరణ పనుల తీరుపై చర్చించారు. అక్కడ నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు చేరుకుని అమృత భారత్ పథకంలో భాగంగా ప్రయాణికుల నిరీక్షణ హాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, వాటర్ అవుట్‌లెట్స్, కార్యాలయాల నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో పలు అంశాలను సమీక్షించారు. అనంతరం గోపాలపట్నం, సింహాచలం నార్త్-దువ్వాడ మధ్య జరుగుతున్న మూడో లైను నిర్మాణ పనులు, గేట్ జంక్షన్-వడ్లపూడి మధ్య జరుగుతున్న నాలుగో లైన్ పనులను పరిశీలించడంతో పాటు పనుల ప్రణాళికలపై చర్చించారు. ఈ పర్యటనలో డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, ఇతర బ్రాంచి అధికారులు పాల్గొన్నారు.